

▶ క్యూఆర్ కోడ్‌తో కొత్త రేషన్ కార్డులు

» కార్డుల్లో పేర్లు తొలగింపు, చేర్చడానికి అవకాశం
» కొత్త కార్డుల జారీకి దరఖాస్తులు: జేసీ జాహ్నవి

అనకాపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): క్యూఆర్ కోడ్‌తో కూడిన కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని జాయింట్ కలెక్టరు ఎం. జాహ్నవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులకు కొత్త రేషన్ కార్డుల మంజూరుతోపాటు పాత కార్డుల్లో చనిపోయిన వారి పేర్లు తొలగింపు, కొత్త వారి పేర్లు చేర్చడానికి అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఇందుకోసం సమీపంలోని గ్రామ/వార్డు సచివాలయాల్లో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని జేసీ సూచించారు.

మన్యం విప్లవ వీరుడు అల్లూరికి ఘననివాళులు

కృష్ణాదేవిపేట, మే 7 (ఆంధ్రజ్యోతి): మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి సందర్భంగా పలువురు ప్రముఖులు, అభిమానులు బుధవారం స్థానిక అల్లూరి పార్కులో ఆయనతోపాటు గాం గంటం దొర సమాధులు, అల్లూరి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అల్లూరి జీవిత చరిత్ర నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని రిటైర్డ్ అదనపు ఎస్పీ కరణం సత్యనారాయణ అన్నారు. అల్లూరి జయంతి సందర్భంగా జూలై నాలుగో తేదీలోగా పార్కులో తెలుగు, ఇంగ్లిష్‌లో 50 చిత్రపటాలతో అల్లూరి జీవిత చరిత్రను ఏర్పాటు చేస్తానని చెప్పారు. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు స్మారక ప్రదేశాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, విశాఖ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, అల్లూరి జిల్లా అధ్యక్షురాలు శాంతకుమారి, జాతీయ అల్లూరి యువజన సంఘం రాష్ట్రకార్యదర్శి పల్లా బాస్కరమణి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



కృష్ణాదేవిపేటలో అల్లూరి సీతారామరాజు, గాం గంటందొరల సమాధుల వద్ద నివాళులు అర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్

అల్లూరి పార్కు అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభం

» ఎంపీ సీఎం రమేశ్



కృష్ణాదేవిపేట, మే 7 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలో అల్లూరి సీతారామరాజు పార్కు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి వుందని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ప్రకటించినట్టు ఎంపీ ల్యాడ్స్‌తో త్వరలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. వర్ధంతి సందర్భంగా మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళులు అర్పిస్తున్నట్టు చెప్పారు. గత వైసీపీ పాలనలో రూ.1.5 కోట్లు మంజూరు చేస్తున్నట్టు అప్పటి మంత్రులు ప్రకటించారని, కానీ ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని గుర్తు చేశారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా త్రివిధ దళాలు సమన్వయంతో దాడులు చేయడం హర్షణీయమని అన్నారు.

యథేచ్ఛగా అక్రమ లేఅవుట్‌లు

వ్యవసాయ భూముల్లో అడ్డగోలుగా వెంచర్లు

» వీఎంఆర్‌డీఏ అనుమతి ఉందంటూ ప్రచారం
» ప్లాట్లుగా అమ్మి సొమ్ము చేసుకుంటున్న రియల్టర్లు
» పట్టించుకోని సంబంధిత శాఖల అధికారులు
» క్షేత్రస్థాయిలో కొరవడిన తనిఖీలు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో అక్రమ లేఅవుట్‌లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎటువంటి అనుమతులు లేకుండా పంట భూములను కొనుగోలు చేసి, ఇళ్ల స్థలాల లేఅవుట్‌లుగా మార్చేస్తున్నారు. లేఅవుట్‌కు అన్ని రకాల అనుమతులు ఉన్నాయంటూ ప్రచారం చేస్తూ ప్లాట్‌ల అమ్మకాలు సాగిస్తున్నారు. జిల్లాలో జాతీయ రహదారి పక్కన వున్న మండలాలే కాకుండా ఏజెన్సీని ఆనుకుని వున్న శివారు మండలాల్లో కూడా ఇబ్బడిముబ్బడిగా అక్రమంగా లేఅవుట్లు వేస్తున్నారు. అయినప్పటికీ పంచాయతీ, వీఎంఆర్‌డీఏ అధికారులు పట్టించుకోవడంలేదు. రియల్టర్ల నుంచి మామూళ్లు తీసుకొని అక్రమ లేఅవుట్‌లపై చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జిల్లాలోని వివిధ మండలాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా వేసిన లేఅవుట్‌లు 300కుపైగా ఉన్నట్టు ఇటీవల రెవెన్యూ అధికారులు నిర్వహించిన ఒక సర్వేలో తేలినట్టు సమాచారం. ఇందులో కొన్ని



కశింకోట మండలం ఉగ్గినపాలెంలో ప్రభుత్వ భూమికి సమీపంలో అనధికార లేఅవుట్



మునగపాక మండలంలో అనధికార లేఅవుట్

రియల్టర్లకు కొమ్ముకాస్తున్నారన్న ఆరోపణలు

లేఅవుట్‌లకు స్థానిక పంచాయతీ అనుమతి మాత్రమే ఉండగా, వీఎంఆర్‌డీఏ నుంచి అనుమతులు తీసుకోలేదు. కొన్నింటికి 'ఆన్ ప్రాసెసింగ్ లేఅవుట్‌లుగా రికార్డుల్లో నమోదు చేసినట్టు తెలిసింది. అయితే ఏ మండలంలో ఎన్ని అనధికార లేఅవుట్‌లు ఉన్నాయో వెల్లడించడానికి అధికారులు ఇష్టపడడం లేదు. దీంతో కొంతమంది రియల్టర్లు వీఎంఆర్‌డీఏ అప్రూవ్డ్ లేఅవుట్‌లుగా ప్రచారం చేసుకొంటూ ప్లాట్‌లు విక్రయిస్తున్నారు. మునగపాక, అనకాపల్లి, కశింకోట, చోడవరం, మాకవరపాలెం, కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో ఈ తరహా అమ్మకాలు అధికంగా జరుగుతున్నాయి.

అనకాపల్లి పట్టణానికి సమీపంలో జాతీయ రహదారికి అనుకొని వున్న ఆవఖండం భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా కొంతమంది రియల్టర్లు భారీ లేఅవుట్‌లు వేస్తున్నారు. ఆవఖండం భూములు ముంపు ప్రాంతం కావడంతో ఇక్కడ ఎటువంటి నిర్మాణాలకు అనుమతి ఇవ్వరు. అంతేకాక వ్యవసాయేతర భూములుగా ... మిగతా 8వ పేజీలో

కన్యకాపరమేశ్వరికి లక్ష మల్లెపూలతో అర్చన

అనకాపల్లి పట్టణంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలను బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో అమ్మవారి ఉత్సవమూర్తికి అభిషేకాలు, లక్ష మల్లె పూలతో అమ్మవారికి అర్చన చేశారు. 102 రకాల మిఠాయిలతో అమ్మవారికి నైవేద్యం పెట్టారు.



లక్ష మల్లెలతో కన్యకాపరమేశ్వరి అమ్మవారికి అర్చన చేసిన దృశ్యం

సొసైటీ ఉద్యోగులకు పీఆర్‌సీనా!?

» ఆర్‌ఈసీఎస్ ఉద్యోగ సంఘాల నాయకులు కోరారని
» ముందువెనుకా ఆలోచించకుండా ఈపీడీసీఎల్ నిర్ణయం
» మలిదశలో కాంట్రాక్టు వర్కర్లకు కూడా అమలు చేసేందుకు ఒప్పందం?
» బకాయిలు రూ.25 కోట్లు ఇచ్చేస్తామంటూ ఆఫర్
» వరుస తప్పులు చేస్తున్న అధికారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సహకార ఉద్యోగులకు పీఆర్‌సీ వర్తింపజేయాలంటే ప్రభుత్వం నుంచి అనుమతులు ఉండాలి. కానీ విశాఖపట్నంలోని ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం అవేమీ పట్టించుకోలేదు. అనకాపల్లి ఆర్‌ఈసీఎస్ ఉద్యోగ సంఘాల నాయకులు పీఆర్‌సీ ప్రకారం జీతాలు కావాలని లేఖలు రాసిన వెంటనే ముందువెనుకా ఆలోచించకుండా నిర్ణయం తీసేసుకుంది. ఆయా జిల్లాల అధికారులకు లేఖలు పంపింది. దాంతో మే నెలలోనే వారికి కొత్త జీతాలు జమ అయ్యాయి.

అనకాపల్లి గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ (ఆర్‌ఈసీఎస్)లో కొన్నేళ్లుగా అడ్డగోలు వ్యవహారాలు జరుగుతున్నాయి. అక్కడ ముందు క్యాజువల్ వర్కర్‌గా చేర్చుకొని ఆ తరువాత వారికి ఏదో ఒక డిజిగ్నేషన్ ఇచ్చేసి రెగ్యులర్ ఉద్యోగులుగా మార్చేసుకుంటున్నారు. అది సొసైటీ కావడంతో పాలకవర్గం ఏది చేస్తే అది చెల్లింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన కొత్తలో ఎటువంటి రిక్రూట్‌మెంట్ ప్రకటన లేకుండానే బీటెక్ చదివిన 15 మందిని ఉద్యోగులుగా తీసుకున్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.25 లక్షలు తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారం నుంచి దిగిపోయే ముందు వారిని రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తిస్తున్నట్టు తీర్మానం చేసి శాశ్వత ఉద్యోగులతో సమానంగా జీతాలు పెంచారు. తాజాగా వారికి 25 ఏళ్ల నుంచి పనిచేస్తున్న వారితో సహా కొత్త పీఆర్‌సీ-2022 వర్తింపజేశారు. అలాగే వైసీపీ నాయకుడు ఒకరు...25 మంది వద్ద రూ.6 లక్షలు చొప్పున తీసుకొని లైన్‌మెన్‌కు అసిస్టెంట్లుగా నియమించారు. వారికి నెలకు రూ.20 వేలు జీతం ఇస్తున్నారు. దీనిపై అప్పుడే పెద్ద దుమారం రేగింది. ఈ విధంగా ఆర్‌ఈసీఎస్‌లో కాంట్రాక్టు పేమెంట్ వర్కర్లు (సీపీడబ్ల్యు) 492 మంది ఉన్నారు. అవసరాలకు మించి ఉద్యోగులు ఉన్నా ఈపీడీసీఎల్ పట్టించుకోవడం లేదు.

శాశ్వత ఉద్యోగులు 120 మందికి ఇప్పుడు పీఆర్‌సీ-2022 ఇచ్చామని, మలి దశలో మిగి



లిన సీపీడబ్ల్యు ఉద్యోగులు 492 మందిని శాశ్వత ఉద్యోగులుగా మార్చి, పీఆర్‌సీ అమలు చేస్తామని ప్రస్తుత నాయకులు ఆశపెట్టారు. దానికి ప్రాసెసింగ్ కూడా జరిగిపోతోంది. ఇప్పుడు ఉద్యోగుల సంఘం రాసిన లేఖను చూపించి కొత్త పీఆర్‌సీ ఎలా ఇచ్చేశారో...వారితో కూడా అలాగే ఒక లేఖ రాయించి, దాని ప్రకారం పర్మనెంట్ చేయిస్తామని చెబుతున్నారు. ఈ విధంగా చేస్తే ఆయా ఉద్యోగులకు రూ.25 కోట్ల వరకూ బకాయిలు వస్తాయి. సాయం చేసినందుకు ఆ మొత్తం మీకే ఇచ్చేస్తామని, శాశ్వత ఉద్యోగులుగా ఉంటే చాలని ఒప్పందం చేసుకున్నట్టు తెలిసింది. ఈ డబ్బుల కోసం ఆశపడి ఈపీడీసీఎల్ అధికారులు దిద్దుకోలేని తప్పులు చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఆర్‌ఈసీఎస్‌లో ఎప్పటి నుంచో పాతుకుపోయిన ప్రాజెక్టు ఇంజనీర్, ఈపీడీసీఎల్ అధికారి ... మిగతా 8వ పేజీలో

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

ఐదుగురిని పట్టుకున్న అనకాపల్లి పోలీసులు

రూ.5 లక్షల సొత్తు, రూ.1.05 లక్షల నగదు స్వాధీనం

» నిందితుల్లో ముగ్గురు ఉమ్మడి గుంటూరు జిల్లా వాసులు
» ఒకరిది విజయవాడ, మరొకరిది నల్గొండ జిల్లా



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సొత్తును పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రావణి. వెనుక నల్లటి ముసుగుల్లో వున్న నిందితులు

కొత్తూరు (అనకాపల్లి), మే 7 (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల్లోని పలు ఇళ్లల్లో చోరీలకు పాల్పడిన దొంగల ముఠాను అనకాపల్లి పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి రూ.5 లక్షల సొత్తు, లక్షకుపైగా నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి బుధవారం ఇక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు.

అనకాపల్లి రూరల్ పోలీసులు బుధవారం సాయంత్రం మండలంలోని మారేడుపూడి కూడలిలో గస్తీ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఐదుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా అక్కడ కనిపించారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా.. పొంతలేని సమాధానాలు చెప్పారు. దీంతో అనుమానం వచ్చి వారి వద్ద వున్న లగేజీని తనిఖీ చేయగా బంగారం, వెండి వస్తువులు, పట్టుచీరలు, ఎలక్ట్రానిక్ వస్తువులు కనిపించాయి. దీంతో పోలీసులు తమదైన శైలిలో విచారణ జరపగా, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పలుచోట్ల చోరీలకు పాల్పడినట్టు చెప్పారు. వీరు పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం మాదల గ్రామానికి చెందిన తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, గుంటూరు నగరంలోని లక్ష్మీపురం ప్రాంతానికి చెందిన ఉప్పల సురేశ్, విజయవాడ ఆంధ్రప్రభ కాలనీకి చెందిన కందివలస నరసింహారావు, తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా అడుసుమల్లి మండలానికి చెందిన ఉరిడి జనార్దన్, గుంటూరు సాంబయ్యకాలనీకి చెందిన కంకణాల సుభాశ్‌లుగా గుర్తించారు. అనంతరం పోలీసు స్టేషన్‌కు తరలించి మరింత విచారించారు.

ఈ నెల ఒకటో తేదీన అనకాపల్లి మండలం కొండకొప్పాక గ్రామానికి చెందిన రిటైర్డ్ షిప్‌యార్డు ఉద్యోగి మరుబాక సత్యనారాయణ ఇంట్లో తులం బంగారం గొలుసు, పావుతులం బంగారం ఉంగరం, రూ.5 వేల నగదు అపహరించుకుపోయారు. అదే రోజు రిటైర్డ్ హెచ్‌ఎం పీలా బాల గణపతిరావు ఇంట్లోకి చొరబడి రూ.లక్ష నగదు, యాపిల్ ఐ ఫోను, రెండు కిలోల వెండి వస్తువులు ఎత్తుకుపోయారు. పట్టణ పోలీసు ... మిగతా 8వ పేజీలో

మధ్యాహ్నం వరకు ఎండ సాయంత్రం చిరుజల్లులు



మాడుగుల మండలం ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో కురుస్తున్న వర్షం

అనకాపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత రెండు రోజులుగా భిన్న వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ మండిపోతుండగా.. మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లబడుతున్నది. కొన్ని మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురుస్తుండగా, మరికొన్ని మండలాల్లో తేలికపాటి జల్లులు కురుస్తున్నాయి. బుధవారం నర్సీపట్నం, రావికమతం, గొలుగొండ, మాడుగుల మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది.

వసతుల్లేని కలెక్టరేట్

» నీడ లేకపోవడంతో ఎండకు, వానకు పాడైపోతున్న వాహనాలు
» మూడేళ్లయినా ఏర్పాటుకాని ఏటీఎం, పోస్టాఫీసు
» హోటళ్లు లేకపోవడంతో భోజనాలకు ఇబ్బంది
» అనకాపల్లి నుంచి కలెక్టరేట్‌కు రావాలంటే ఆటోలను ఆశ్రయించాల్సిందే

అనకాపల్లి కలెక్టరేట్, మే 7 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పడి మూడేళ్లు దాటినా.. కలెక్టరేట్ వద్ద కనీస వసతులు కల్పించకపోవడంతో వివిధ పనులు నిమిత్తం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ఏటీఎం, పోస్టాఫీసు వంటివి ఏర్పాటు చేయలేదు. పట్టణానికి సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో వున్న కలెక్టరేట్‌కు బస్సు సదుపాయం కల్పించలేదు.



కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎండలో వాహనాలు

మూడేళ్ల క్రితం నాటి వైసీపీ పాలకులు హడావిడిగా జిల్లాల పునర్విభజన చేశారు. అనకాపల్లి కేంద్రంగా ఏర్పాటు చేసిన కొత్త జిల్లా కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయాలను పట్టణంలో కాకుండా సమీపంలోని శంకరం పంచాయతీలో గతంలో నడిచిన ఒక ప్రైవేటు కళాశాల భవనాలను అద్దెకు తీసుకుని ఏర్పాటు చేశారు. ఇక్కడ కలెక్టర్, జేసీలతో పాటు 200 మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇక వివిధ పనుల నిమిత్తం నిత్యం వందలాది మంది ఇక్కడకు ... మిగతా 8వ పేజీలో

జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

అచ్యుతాపురం, మే 7 (ఆంధ్రజ్యోతి): భోగాపురంలో మరిడిమాంబ అమ్మవారి జాతర సందర్భంగా జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను జడ్పీటీసీ సభ్యుడు లాలం రాంబాబు బుధవారం ప్రారంభించారు. ఉమ్మడి విశాఖ జిల్లా నలుమూలల నుంచి 12 జట్లు ఈ టోర్నమెంటులో పాల్గొంటున్నాయి. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కూండ్రపు నాయుడు బాబు, సీఐటీయూ మండల కన్వీనర్ కూండ్రపు సోమునాయుడు, కె.పటేల్, ఎల్.అనిల్, జి.శ్రీను, పి.లోకేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఠారెత్తిస్తున్న ఎండలు


ఎంత తీవ్రతకు నిర్మానుష్యంగా ఉన్న రాంబిల్లి ప్రధాన జంక్షన్

రాంబిల్లి, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. బుధవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత అధికంగా ఉంది. దీంతో నిత్యం రద్దీగా ఉండే రహదారులు కూడా నిర్మానుష్యంగా కనిపించాయి. ఎండ వేడిని తట్టుకోలేక జనం ఇళ్లకే పరిమితమయ్యారు.

'హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించాలి'

అచ్యుతాపురం రూరల్, మే 7, (ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతి ఉత్సవాలను వాడవాడలా ఘనంగా జరుపుకోవాలని సమరసతా సేవా ఫౌండేషన్ ఎలమంచిలి సబ్ డివిజన్ కన్వీనర్ బీవీ రమణ పిలుపునిచ్చారు. ఈ నెల 22న వైశాఖ బహుళ దశమి రోజున హనుమాన్ జయంతి జరుపుకుంటామన్నారు. వారంలో ఒక రోజు భజన సేవలు, పౌర్ణమికి సామూహిక హారతి, ఏకాదశి రోజున నగర సంకీర్తన తప్పకుండా జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు కొల్లి అప్పారావు, గుడివాడ రమణ, సన్నిధి ఈశ్వరరావు, కోసూరు భాను ప్రకాష్, కందుల భవానీ, కంఠంరెడ్డి ఆదిలక్ష్మి, రేవతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి వర్ధంతి


అచ్యుతాపురంలో అల్లూరికి నివాళులర్పిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం, మే 7 (ఆంధ్రజ్యోతి): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని అచ్యుతాపురంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మోసయ్యపేటలోని అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అల్లూరి త్యాగాన్ని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము, మారిశెట్టి వెంకట అప్పారావు, కె.సోమునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

రాంబిల్లి: మండల కేంద్రం రాంబిల్లిలో బుధవారం అల్లూరి ప్రజా సంఘాల, అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు మాట్లాడుతూ బ్రిటిష్ పాలకులను గడగడలాడించిన వీరుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అల్లూరి సంఘం అధ్యక్షుడు అప్పారావు, నాయకులు భూపతి అప్పారావు, సీహెచ్ గంగరాజు, వై.రాము, డి.కాశియ్య, సీహెచ్ పవన్‌కుమార్, తాతారావు, కార్మికులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జోరుగా ఉపాధి పనులు


పంచదార్లలో పంట కుంట తవ్వకాల పనులు చేస్తున్న ఉపాధి శ్రామికులు

రాంబిల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పంచాయతీల్లో ఉపాధి పనులు జోరుగా సాగుతున్నాయి. సుమారు 26 పంచాయతీల్లో ఉపాధి పనులు జరుగుతుండగా, 4,060 మంది ఉపాధి శ్రామికులు పనులు చేస్తున్నారు. ఉదయం 6 నుంచి 10.30 గంటల వరకు వీరు ఉపాధి పనులు చేస్తున్నట్టు ఉపాధి పథకం ఏపీవో శ్రీనివాసరావు తెలిపారు. అర్హత కలిగిన ప్రతి వేతనదారునికి వంద రోజులు పనులు కల్పించమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వ్యవసాయ అనుబంధ పనులు, నీటి కందకాలు, ఇంకుడు గుంతలు వంటి పనులు చేపడుతున్నామన్నారు. ఉపాధి పనులు చేసే పరిసరాల వద్ద చలువ పందిర్లు ఏర్పాటు చేయడంతో పాటు తాగునీరు, మందుల కిట్లను కూడా అందుబాటులో ఉంచామని తెలిపారు. ఉపాధి శ్రామికులకు రోజుకు రూ.280ల వరకు వేతనం వస్తుందన్నారు. పశువులకు గడ్డి పెంపకానికి కూడా రైతులు దరఖాస్తు చేసుకుంటే నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. మండలంలో అవసరమైన గ్రామాల్లో సుమారు 120 పంట కుంటల తవ్వకాలు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటికే పలు పంచాయతీల్లో 70 వరకు పంట కుంటల తవ్వకాలు పూర్తి చేశామని తెలిపారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు

▸▸ ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ హెచ్చరిక


ఎలమంచిలి సమీపంలోని చెరువు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్

ఎలమంచిలి, మే 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం పట్టణంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. పట్టణంలో గ్రామ కంఠం స్థలాలు, దేవదాయ శాఖకు చెందిన స్థలాలను రెవెన్యూ, మునిసిపల్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. పట్టణంలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికావడం వల్ల ప్రజలకు ఉపయోగపడే నిర్మాణాలు చేపట్టడానికి స్థలాలు లేకుండాపోయాయన్నారు. పట్టణంలో ఉన్న మార్కెట్‌ను ధర్మవరం సమీపంలోని వారపు సంత ఆవరణలోకి మార్పు చేసేలా చర్యలు తీసుకోవాలని మునిసిపల్ అధికారులను ఆయన ఆదేశించారు. కల్కి పెట్రోల్ బంకు సమీపంలోని రాళ్ల చెరువును పరిశీలించి చెరువు అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. దేవదాయ శాఖకు చెందిన స్థలాల గురించి స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో రెవెన్యూ అధికారులు గ్రామ కంఠం స్థలాల సర్వే చేపట్టారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు, టీపీవో శ్రీలక్ష్మి, రెవెన్యూ డీటీ. వినయ్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

పీ 4 సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలి

అచ్యుతాపురం: పీ 4 సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ఆదేశించారు. బుధవారం అచ్యుతాపురంలోని తన స్వగృహంలో అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం లేని సమాజమే లక్ష్యంగా ప్రభుత్వం, ప్రైవేటు భాగస్వామ్యంతో చేపట్టిన పీ 4 సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జనవాణిలో అర్జీల స్వీకరణ


జనవాణిలో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

రాంబిల్లి: జనవాణి కార్యక్రమం ద్వారా ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలు పరిష్కరిస్తున్నామని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని హరిపురంలో గల జనసేన పార్టీ కార్యాలయంలో జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల వారీగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, వాటిని పరిశీలించి శాఖాపరంగా అధికారులకు అందజేశారు. ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన పలు సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు, డ్వామా పీడీ ఆర్.పూర్ణిమాదేవి, ఎంపీడీవో జయమాధవి, ఈవోపీఆర్డీ రాజు, రాంబిల్లి, జనసేన, టీడీపీ మండల శాఖల అధ్యక్షుడు వి.దిన్‌బాబు, పలు శాఖల అధికారులు, పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, కూటమి నేతలు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త సేకరణపై ఆరా

▸▸ కేంద్రాన్ని పరిశీలించిన స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్జునరావు


శేషుకొండ వద్ద ఉన్న తడి, పొడి చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అర్జునరావు

ఎలమంచిలి, మే 7 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని శేషుకొండ సమీపంలో ఉన్న తడి, పొడి చెత్త సేకరణ కేంద్రాన్ని బుధవారం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.అర్జునరావు పరిశీలించారు. కమిషనర్ ప్రసాదరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావులకు పలు సూచనలు చేశారు. మునిసిపాలిటీలో ప్రతి రోజూ ఇంటింటా తడి, పొడి చెత్త సేకరణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. తడి చెత్తను కాపులుప్పాడ సమీపంలోని గ్యారేజీకి తరలిస్తున్నామని, పొడి చెత్తను శేషుకొండ వద్ద ఉన్న యూనిట్ వద్ద నుంచి ప్రైవేటు ఏజెన్సీ ద్వారా ఎరువు తయారీకి పంపుతున్నామని అర్జునరావుకు కమిషనర్ వివరించారు. చెత్త సేకరణ ద్వారా ఆదాయ వనరులు ఏ విధంగా సమకూరుతున్నాయో అనే అంశాలను పరిశీలించేందుకు కాకినాడ కార్పొరేషన్‌ను మునిసిపల్ అధికారులు సందర్శించి అక్కడి నిర్వహణ తీరుపై అవగాహన పెంపొందించుకోవాలని ఈడీ సూచించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పార్కును ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోండి


పంచాయతీ కార్యదర్శి సంతోశ్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

రాంబిల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లాలంకోడూరులో మినీ పార్కును ధ్వంసం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ లాలం రమేశ్‌నాయుడు, గ్రామస్థులు పంచాయతీ కార్యదర్శికి సంతోశ్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన కు వినతిపత్రం అందజేశారు. ఈ పార్కును ఈ నెల 5వ తేదీ రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎక్స్‌కవేటర్‌తో ధ్వంసం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు లాలం అభిరామ్, బి.రాంబాబు, ఎం.రమణారావు, కశిరెడ్డి సర్వేశ్వరరావు, ఆర్.గిరి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో అవస్థలు

ఎలమంచిలి, మే 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో తరచూ అనధికార విద్యుత్ కోతలతో జనం అవస్థలు పడుతున్నారు. బుధవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో జనం అల్లాడిపోయారు. అసలే ఎండ తీవ్రతతో ఉక్కిరిబిక్కిరి అవుతుంటే తరచూ విద్యుత్ కోతలు విధించడమేమిటని జనం మండిపడుతున్నారు. విద్యుత్ కోతల వల్ల వ్యాపారాలు సాగక దుకాణదారులు గగ్గోలు పెడుతున్నారు. ఈ నెలలో సుమారు 9 గంటల పాటు విద్యుత్ సరఫరాను నిలిపివేయడం ఇది మూడవసారి. దీనిపై విద్యుత్ శాఖ ఏఈ ఎ.కనకరాజు వివరణ కోరగా నిర్వహణ పనుల్లో భాగంగా విద్యుత్ కోతలు విధించాల్సి వస్తుందని, ఇకపై తగిన జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు.

కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు


నగర సంకీర్తనలో వాసవీమాత భక్తులు

నక్కపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక వాసవీ కల్యాణ మండపంలో పలు పూజలు చేశారు. అనంతరం అమ్మవారి చిత్రపటంతో పురవీధుల్లో నగర సంకీర్తన చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కక్కిరాల సురేశ్, సెక్రటరీ కొత్త సందీప్, గౌరవ అధ్యక్షుడు మామిడి తాతాజీ, కొత్త సాయిరాం భగవాన్, గుప్తా, నున్న గణేశ్, కొత్త రాము, విశ్వేశ్వరరావు, బాబ్జీ, లక్ష్మణ్, సత్తికొండ, సుబ్రహ్మణ్యం, అయ్యప్ప పాల్గొన్నారు.

'సంపద' కేంద్రాలను నిర్వహించకుంటే చర్యలు

▸▸ ఈవోపీఆర్డీ చంద్రశేఖరరావు


పి.ఎల్.పురంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈవోపీఆర్‌డీ

పాయకరావుపేట రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద త యారీ కేంద్రాలను సక్రమంగా వినియోగించకుంటే సంబంధిత కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేసి తగిన చర్యలు తీసుకుంటామని ఈవోపీఆరడీ సి.హెచ్.చంద్రశేఖరరావు హెచ్చరించారు. మండలంలోని పి.ఎల్.పురం, మంగవరం, అరట్లకోట, గ్రామాలలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత పంచాయతీ కార్యదర్శులు ఐవీఆర్ఎస్ సర్వే ప్రకారం ఎంపిక చేసిన గ్రామపంచాయతీల్లో పనితీరు బాగాలేదని గుర్తించామన్నా రు. సంపద తయారీ కేంద్రాలలో రెండు నుంచి మూడు వర్మీ పిట్లు మాత్రమే వినియోగిస్తున్నారన్నారు. కలెక్టరు ఆదేశాల మేరకు పంచాయతీ పరిధిలో వేసి న లేఅవుట్ల వివరాలు ఇవ్వాలన్నారు. పాయకరావుపేట, పిఎల్.పురం, శ్రీ రాంపురం, పి.ఆర్.బి.పురం, పాల్మన్‌పేట, కేశవరం, పంచాయతీ కార్యదర్శులు తక్షణమే ఈ మేరకు నివేదికలను అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శివరాం, కొండలరావు, రమేశ్, మల్లికార్జునాచారి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణంపై అవగాహన

నక్కపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం గ్రంథాలయాధికారి కె.జనార్దన్ నేతృత్వంలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. జడ్పీ హైస్కూల్ సైన్స్ టీచర్ కల్యాణి ప్లాస్టిక్, పాలిథిన్ వాడడంతో కలిగే దుష్పరిణామాలను వివరించారు. పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. పిల్లలకు క్విజ్ పోటీలు నిర్వహించారు.


పాయకరావుపేటలో అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



నక్కపల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు

స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరిది చెరగని ముద్ర

పాయకరావుపేట , మే 7 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్రోద్యమంలో అల్లూరి సీతారామరాజు పోరాటం ప్రజల మదిలో చెరగని ముద్రవేసిందని వక్తలు కొనియాడారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం అల్లూరి వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పుస్తకపఠనం, ఉపాధ్యాయుడు వెంకటేష్ విద్యార్థులకు గణితం బోధించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రఘురామరాజు విద్యార్థులకు అల్లూరి సీతారామరాజు చరిత్ర, భగవద్గీత, యోగా తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ వామాల లక్ష్మణరావు పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

నక్కపల్లి: అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతిని స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద నిర్వహించారు. ముందుగా అల్లూరి చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం.రాజేశ్ నివాళులర్పించారు. కార్యక్రమంలో కె.ప్రసాద్, వై.అప్పారావు, వై.సత్తిబాబు, ఎస్.శ్రీను, రాజు పాల్గొన్నారు.

ఎస్. రాయవరంలో..

ఎస్.రాయవరం: ధర్మవరం అగ్రహారంలో అల్లూరి విగ్రహానికి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం అప్పలరాజు పలువురితో కలసి పూలమాల వేసి నివాళులర్పించారు.గుర్రాజుపేటలో నాయకులు వర్ధం తిని జరిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న ప్యానల్ అడ్వకేట్ నూకరాజు

ఎస్. రాయవరం, మే 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి గుడివాడలోని సాయి మెరైన్ రొయ్యల పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు బుధవారం ఎలమంచిలి కోర్టు న్యాయ సలహా ప్యానెల్ ఆధ్వర్యంలో కార్మిక చట్టాలు, మౌలిక వసతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అడ్వకేట్ నూకరాజు మాట్లాడుతూ కార్మిక చట్టాలతోపాటు పరిశ్రమల్లో కల్పించాల్సిన మౌలిక వసతులపై కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఏఆర్‌డీఎస్ ఎన్‌జీవో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ మణికుమా ర్‌బాబు, వీఆర్వో, కార్యదర్శులు పాల్గొన్నారు.

టీడీపీ బూత్ కమిటీ ఎన్నికలకు సన్నాహాలు


మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు చిట్టిబాబు

పాయకరావుపేట, మే 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పాయకరావుపేట పట్టణ బూత్ కమిటీ ఎన్నికలు సజావుగా జరిగేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు కోరారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో జరుగనున్న పట్టణ బూత్ కన్వీనర్, కో-కన్వీనర్, మండల సబ్ కమిటీల్లో ప్రభుత్వం చేపట్టే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి, పార్టీ బలోపేతానికి కృషిచేసేవారిని ఎన్నిక య్యేలా నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పార్టీ పరిశీలకులు సీహెచ్. వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీనుతోపాటు పార్టీ నాయకులు చింతకాయల రాంబాబు, బొంది కాశీవిశ్వ నాథం, కంకిపాటి వెంకటేశ్వరరావు, యాళ్ల వరహాలబాబు, చిక్కాల శ్రీను, గూటూరు శ్రీనివాసరావు, మజ్జూరి నారాయణరావు, మలిపెద్ది వెంకటరమణ, జూరెడ్డి ప్రసాద్, వేములపూడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి

▸▸ చినదొడ్డిగల్లు జడ్పీ పాఠశాల ఉపాధ్యాయుడు ప్రచారం


కర పత్రాలు పంచుతున్న ఉపాధ్యాయుడు వెంకటరమణ

నక్కపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో ఆ ఉపాధ్యాయుడు తన సొంత పనులు చూసుకోకుండా తాను పనిచేస్తున్న ప్రభుత్వ పాఠశాలలో పిల్లల హాజరు పెంచాలన్న పట్టుదలతో పనిచేస్తున్నారు. ప్రైవేట్ స్కూళ్లల్లో చదువుకుంటున్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. మండల పరిధి చినదొడ్డిగల్లు జడ్పీ హైస్కూల్‌లో పనిచేస్తున్న ఆంగ్ల ఉపాధ్యాయుడు యేడిద వెంకట రమణ ఈ విధంగా ప్రచారం సాగిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వివరాలివి.. గత పది రోజులుగా హైస్కూల్ పరిధిలోని కాగిత, అప్పలరాజుపేట, కొత్తూరు, వెదుళ్లపాలెం గ్రామాల్లో ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్న పిల్లలను గుర్తించి నేరుగా వారిళ్లకు ఆయన వెళ్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన, అక్కడున్న సదుపాయాలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ పాఠశాలల్లో అర్హతలు, ఎంతో నైపుణ్యత, అనుభవం ఉన్న ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తారని చెబుతున్నారు. ప్రస్తుతం ప్రైవేట్ స్కూళ్లల్లో చదువుకుంటున్న 12 మంది విద్యార్థులకు తన హైస్కూల్‌లో అడ్మిషన్లు కూడా ఇచ్చారు. అలాగే, గ్రామాల్లో టెన్త్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఏ కోర్సులు చదవాలి ? అవకాశాలు ఎలా వుంటాయనే దానిపైనా ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు పెంచాలన్నదే తమ అభిమతమని వెంకట రమణ చెబుతున్నారు. ఇటీవల టెన్త్ ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ఫలితాలు సాధించినట్టు పేర్కొన్నారు.

దేశ భవిష్యత్తుకు కిశోర బాలికలు పునాది


మాట్లాడుతున్న బాలల పరిరక్షణ ప్రతినిధి లోవరాజు

కోటవురట్ల, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కైలాసపట్నం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం జిల్లా బాలల పరిరక్షణ ప్రతినిధి డి. లోవరాజు ఆధ్వర్యంలో కిశోర వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12నుంచి 18ఏళ్ల వయసు కలిగి పిల్లలు దేశ భవిష్యత్తుకు పునాది వంటి వారని అన్నారు. బాలికలను ప్రేమపేరిట కొందరు వారిని వంచనకు గురిచేస్తున్నారు. బాల్యవివాహాలు జరిపిస్తున్నారన్నారు. వీటిని వ్యతిరేకించాలని కోరారు. బాలికలకు విద్య, నైపుణ్యం, ఎదుగుదల, పోటీతత్వం, వ్యక్తిగత శుభ్రత, లింగవివక్షత, లైంగిక విద్య అవగాహన కల్పించారు. పిల్లలందరినీ బడికి పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏఎన్ఎం మణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పెన్నాడలక్ష్మి, పురం గంగ, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవతో ఆర్థిక చేయూత


పెట్టుగోళ్లపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఎస్. రాయవరం, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెట్టుగోళ్లపల్లిలో బుధవారం ఏవో సౌజన్య ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పథకం ద్వారా రైతుల కుటుంబాలకు ఏడాదికి కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పేరుతో రూ. 6వేలతోపాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. 14వేలు కలిపి మొత్తం రూ. 20 అందించనున్నట్టు చెప్పారు. అర్హులైన రైతులంతా గ్రా మాల్లో గల రైతు సేవా కేంద్రాల్లో వివరాలతో నమోదు చేసుకోవాలని సూచించారు. శత శాతం ప్రకృతి వ్యవసాయ గ్రామంగా ఎంపిక చేయడంతో ఈమేరకు అవగాహన ర్యా లీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి అల్లు నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : సీఐ


ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ రామకృష్ణ

ఎస్. రాయవరం, మే 7 (ఆంధ్ర జ్యోతి): వాహనదారుల ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని నక్కపల్లి రూరల్ సీఐ రామకృష్ణ హెచ్చరించారు. మండలంలోని అడ్డ రోడ్డు జంక్షన్‌లో బుధవారం సీఐ పలు ఆటో స్టాండ్‌లకు చెందిన డ్రైవర్లతో సమావేశమై ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓవర్ లోడ్‌తో ఆటో నడపరాదన్నారు. నిబంధనలు అతిక్రమించిన డ్రైవర్లపై కేసు నమోదుతోపాటు ఆటోను సీజ్ చేస్తామని సీఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కోటవురట్ల ఎస్ఐ రమేశ్ పాల్గొన్నారు.

విప్లవ వీరుడు అల్లూరికి ఘన నివాళులు

నర్సీపట్నం, మే 7 (ఆంధ్రజ్యోతి): విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజుకు అధికారులు, ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. అల్లూరి 101వ వర్ధంతి సందర్భంగా మునిసిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి పార్టీ నాయకులతో కలిసి కొత్తవీధి పెద్ద చెరువు వద్ద ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి బుధవారం పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న, సీపీఎం నాయకులు అడిగర్ల రాజు, యూటీఎఫ్ నాయకుడు చిట్టియ్య నివాళులర్పించారు. ఎన్టీఆర్ మినీ స్టేడియంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, గురుబాబు తదితరులు నివాళులర్పించారు.


అల్లూరి విగ్రహానికి పూలవేసి నివాళులు అర్పిస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్

గొలుగొండలో...

గొలుగొండ: మండలంలోని చీడిగుమ్మల గ్రామంలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి సీపీఐ నాయకులు మాకిరెడ్డి రామునాయుడు, రాధా కృష్ణ తదితరులు బుధవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరంలో అల్లూరి ఉద్యమాన్ని వారు కొనియాడారు.

కృష్ణాదేవిపేటలో...

కృష్ణాదేవిపేట: చోద్యం, ఏఎల్‌పురం, కొంగసింగి, పాతకృష్ణాదేవిపేట తదితర గ్రామాల్లో అల్లూరి విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కృష్ణాదేవిపేట అల్లూరి పార్కులో అల్లూరి ఉత్సవ కమిటీ సభ్యులు ముందుగా అల్లూరికి నివాలర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ దేశం కోసం చిన్న వయస్సు ప్రాణాలు అర్పించిన వీరుడు అల్లూరి అని కొనియాడారు. అల్లూరి జీవిత చరిత్రను బావితరాలకు గుర్తుండేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకా భాస్కరావు, అల్లూరి ఉత్సవ కమిటీ నాయకులు వి.సుబ్రహ్మణ్యం, మురళీమోహన్‌రావు, రామారావు పాల్గొన్నారు.

నాతవరంలో...

నాతవరం: సరుగుడు గిరిజన గ్రామంలో బుధవారం స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గిరిమిత్ర సభ్యులు బండి గంగరాజు మాట్లాడుతూ గిరిజన హక్కుల కోసం బ్రిటీష్ వారితో పోరాడిన యోధుడు అల్లూరి సీతారామరాజు అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మాకవరపాలెంలో...

మాకవరపాలెం: మండల కేంద్రంలో టీడీపీ, బీజేపీ నాయకులు అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై.పాత్రుడు మాట్లాడుతూ అల్లూరి వర్ధంతి రోజే పాకిస్తాన్‌పై భారత్ దాడిచేయడం శుభ సూచికమన్నారు. ఇలాంటి దాడులు మరిన్ని జరగాలని వారు ఆకాక్షించారు. అలాగే ఆపరేషన్ సిందూర్‌కు ప్రతి ఒక్కరూ మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. పార్టీలకతీతంగా సైనికులకు అండగా మద్దతు పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మాధవ్, టీడీపీ నాయకులు అల్లు రామునాయుడు, పోతల రాంబాబు, ఓబ్బలరెడ్డి గోవింద, దువ్వాసి వెంకట గిరి, లాలం రాము, సిద్దాబత్తుల శ్రీను, బీజేపీ మండల అధ్యక్షుడు మత్రినాయుడు, నాయకులు అడిగర్ల రాంబాబు, రఘ చక్రవర్తి, అంజేనేయులు పాల్గొన్నారు.


మాకవరపాలెంలో అల్లూరి విగ్రహానికి పూలమాలు వేస్తున్న టీడీపీ నాయకులు


అల్లూరి, గంటందొర సమాధుల వద్ద నివాళులర్పిస్తున్న మాధవ్

ఉద్యమాలకు స్ఫూర్తి ప్రదాత అల్లూరి

▸▸ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

కృష్ణాదేవిపేట, మే 7 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం బ్రిటీష్ సామాజ్యంపై చిన్న వయస్సులోనే ప్రాణాలర్పించిన స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరి సీతారామరాజు ఉద్యమాలకు స్ఫూర్తి ప్రదాత అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎస్ మాధవ్ అన్నారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా బుధవారం కృష్ణాదేవిపేట అల్లూరి పార్కులో అల్లూరి, గంటందొర సమాధులకు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి పార్కు అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. అల్లూరి జీవిత చరిత్ర బావితరాలకు చాటి చెప్పేలా స్మారక ప్రాంతాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరావు, విశాఖ జిల్లా అధ్యక్షుడు పరుశురామ్‌రాజు, అల్లూరి జిల్లా అధ్యక్షురాలు శాంతకుమారి, కేంద్ర కాఫీ బోర్డు సభ్యులు కురశా ఉమామహేశ్వరావు, రాష్ట్ర ట్రైకార్ డైరెక్టర్ కూడా కృష్ణారావు, బీజేపీ నాయకులు అరిమెల రాజు, గాదె శ్రీనివాసరావు, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి జీవిత చరిత్ర తెలిపేలా చిత్రపటాలు

▸▸ రిటైర్డ్ జిల్లా అదనపు ఎస్పీ కరణం సత్యనారాయణ


నివాళులు అర్పిస్తున్న సత్యనారాయణ, అల్లూరి సంఘం నాయకులు

కృష్ణాదేవిపేట, మే 7 (ఆంధ్రజ్యోతి): విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్ర తెలిపేలా 50 చిత్రపటాలను ఏర్పాటు చేస్తానని ఉమ్మిడి విశాఖ జిల్లా రిటైర్డ్ అదనపు ఎస్పీ, అల్లూరి జీవిత చరిత్ర విశ్లేషకులు కరణం సత్యనారాయణ తెలిపారు. అల్లూరి వర్ధంతిని పురస్కరించుకుని పలువురు ప్రజా ప్రతినిధులు, యువజన సంఘం నాయకులు, అభిమానులతో కలిసి అల్లూరి, గంటందొర సమాధులకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2007లో అల్లూరి జీవిత చరిత్రకు సంబంధించి 30 శిలాఫలకాలను పార్కులో ఏర్పాటు చేశానని, ప్రస్తుతం మరిన్ని శిలాఫలకాలు ఏర్పాటుకు కృషి చేస్తున్నానని చెప్పారు. అలాగే అల్లూరి జీవిత చరిత్ర తెలిపేలా చిత్రపటాలు ఏర్పాటు చేస్తానని, ఈ కార్యక్రమానికి అందరూ సహకరించాలని కోరారు. అల్లూరి చరిత్రకు సంబంధించి పుస్తకాలను రచించి ప్రచురించామని, వీటిని పార్కులో అందుబాటులో ఉంచామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో జాతీయ అల్లూరి యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి పల్లా భాస్కరమణి, సీపీఐ సీనియర్ నేత మేకా సత్యనారాయణ, ఏఎల్‌పురం సర్పంచ్ లోచల సుజాత, టీడీపీ నాయకులు బొడ్డు జమీలు, సిహెచ్.చిట్టిబాబు, పెట్ల నారాయణమూర్తి, గొంప వాసు పాల్గొన్నారు.

వివాదాస్పద భూమికి హద్దులు ఏర్పాటు

గొలుగొండ, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తమల్లంపేట రెవెన్యూ గ్రామంలో వివాదాస్పదమైన జిరాయితీ భూమికి పోలీసుల సమక్షంలో బుధవారం హద్దులు ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ గ్రామంలోని బీసీ కాలనీకి ఆనుకుని సర్వే నంబరు 133-2-ఎ-1లో 78 సెంట్ల భూమికి సంబంధించి కుటుంబ తగాదాలతో ఇరు వర్గాలు గతంలో కోర్టును ఆశ్రయించినట్టు చెప్పారు. దీంతో కోర్టు ఆదేశాల ఆధారంగా పోలిరెడ్డి రాజబాబుకు ఆక్రమణలు తొలగించి భూమిని అప్పగించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నాగరాజు, ఎస్ఐ రామారావు, మండల సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది తదితరలు పాల్గొన్నారు.


హద్దులు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ, పోలీసు అధికారులు

అయ్యప్పస్వామి, దుర్గమ్మకు క్షీరాభిషేకం

నర్సీపట్నం, మే 7 (ఆంధ్రజోతి): అయ్యప్పస్వామి ఆలయంలో విగ్రహం, యంత్ర పునః ప్రతిష్ఠ కార్యక్రమం రెండో రోజు అత్యంత వైభవంగా జరిగింది. స్పీకర్ అయ్యన్న పాత్రుడు, పద్మావతి దంపతుల చేతుల మీదుగా అయ్యప్పస్వామి, దుర్గమ్మ కొత్త విగ్రహాలకు బుధవారం క్షీరాభిషేకం నిర్వహించారు. ముందుగా యాగశాలలో నైరుతి దిశలో వేద పండితులు వాస్తు పూజ నిర్వహించారు. అనంతరం విగ్రహాలకు పాలతో అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


విగ్రహాలకు పాలతో అభిషేకం చేస్తున్నన స్పీకర్

టీడీపీ నాతవరం గ్రామ నూతన కార్యవర్గం

నాతవరం, మే 7 (ఆంధ్రజ్యోతి): నాతవరం గ్రామ టీడీపీ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. పార్టీ గ్రామ అధ్యక్షుడిగా పైల సూరిబాబు, ఉపాధ్యక్షుడిగా అపిరెడ్డి కొండబాబు, ప్రధాన కార్యదర్శిగా లంకా కోటేశ్వరరావు, కార్యనిర్వహక కార్యదర్శిగా పొడుగు నాగరాజు ఎన్నికయ్యారు. అందరి సమన్వయంతో పార్టీని ముందుకు నడిపించాలని ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు ఎన్.వెంకటరమణ సూచించారు. ఈ కార్యక్రమంలో తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ, మాజీ ఎంపీపీలు ఎన్.విజయ్‌కుమార్, కొండబాబు, నాయకులు ఎ.మాణిక్యం, వై.కాశీ, సీతారామ్మూర్తి, బి.సూరిబాబు, రాజుబాబు, ఎస్.నానాజీ, సిహెచ్.శ్రీనివాసు, శెట్టి నాయుడు, పి.జోగారావు పాల్గొన్నారు.

అటవీ సంపద పరిరక్షణకు కృషిచేయాలి

ఉత్తరాంధ్ర జిల్లాల సీసీఎఫ్ దివాన్ మైథీన్

కృష్ణాదేవిపేట, మే 7 (ఆంధ్రజ్యోతి): అడవుల పరిరక్షణ, మొక్కల పెంపకానికి ప్రజలు సహకరించాలని ఉత్తరాంధ్ర జిల్లాల సీసీఎఫ్ దివాన్ మైథీన్ కోరారు. గొలుగొండ మండలంలోని కృష్ణాదేవిపేట అటవీ కార్యాలయాన్ని బుధవారం సందర్శించి రికార్డులను తనిఖీలు చేపట్టారు. అనంతరం కృష్ణాదేవిపేట, గొలుగొండలో ఏర్పాటు చేసిన నర్సరీ బ్యాగ్ మొక్కలు, నల్లగొండ టేకు అటవీ ప్లాంటేషన్లను సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సీసీఎఫ్ మైథీన్ మాట్లాడుతూ అటవీ సంపద పరిరక్షణ కోసం టేకు, రోజ్‌వుడ్, గన్నర, గుమ్మిడి తదితర విలువైన మొక్కలు వేయాలన్నారు. అలాగే రైతులకు అవసరమైన సరుగుడు, జామ, నేరడి తదితర మారుజాతి మొక్కలను ఉచితంగా పంపిణీకి నర్సరీలు సిద్ధం చేస్తున్నట్టు ఆయన తెలిపారు. కలప అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం డీఎఫ్‌వో శ్యామ్యూల్, ఉత్తరాంధ్ర జిల్లాల స్క్వాడ్ డీఎఫ్‌వో సునీల్‌కుమార్, కృష్ణాదేవిపేట అటవీ రేంజ్ అధికారి కె.శ్రీనివాసరావు, డీఆర్‌వో సత్యనారాయణ పాల్గొన్నారు.

12న ఐటీఐలో అప్రెంటిస్‌షిప్ మేళా

నర్సీపట్నం, మే 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 12వ తేదీన ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిషిప్ మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ శ్రీనివాసచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే మేళాలో 15 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. ఐటీఐ అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు జెరాక్స్ సెట్లు, పాస్‌పోర్ట్ ఫొటోలతో హాజరుకావాలని ఆయన సూచించారు.

మోస్తరు వర్షం

కృష్ణాదేవిపేట, మే 7 (ఆంధ్రజ్యోతి): కృష్ణాదేవిపేట, లింగంపేట, విప్పలపాలెం, ఏఎల్‌పురం, చోద్యం, నాగాపురం, కొంగసింగి గ్రామాల్లో బుధవారం మోస్తరు వర్షం కురిసింది. మూడు రోజులుగా ఎండతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షం ఉపశమనం కల్పించింది. వాతావరణం చల్లబడడంతో వారు ఊరట చెందారు.

20న మునిసిపల్ కార్మికుల సమ్మె

▸▸ కమిషనర్ సురేంద్రకు సమ్మె నోటీసు

నర్సీపట్నం, మే 7 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కమిషనర్ సురేంద్రకు బుధవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన లేబర్ కోడ్స్ రుద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మే 20న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మునిసిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, జనాభా ప్రాతిపదికన పారిశుధ్య కార్మికులను నియమించాలని డిమాండ్ చేశారు. మరణించి కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, నాయకులు బొర్రా వాసు, వానుపల్లి రమణ, కుపరాల హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

చోడవరం, మే7 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9న స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎండీవో పీవీఎస్‌జే అంజనేయులు తెలిపారు. ఈ సమావేశానికి మండల పరిషత్ సభ్యులతో పాటు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఎండీవో విజ్ఞప్తి చేశారు.

ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు

▸▸ ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా అధికారి లక్ష్మన్న

చోడవరం, మే7 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం రైతులకు, నేలకు ఎంతో ప్రయోజనకరమని జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారి లక్ష్మన్న తెలిపారు. గోవాడలో బుధవారం రైతులకు ప్రకృతి వ్యవసాయ విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, నిరంతర సాగు చేయడం వల్ల భూమి గుల్ల పడడంతో పాటు, నేల సారం, సామర్థ్యం పెరుగుతుందన్నారు. తొలకరికి ముందు నవధాన్యాలు పొలంలో వేయడం వల్ల ప్రధాన పంటల్లో కలుపు తగ్గడంతో పాటు, రసాయన ఎరువుల వాడకం కూడా తగ్గుతుందని అన్నారు. ఈ సందర్భంగా రైతులతో తొమ్మిది రకాల జాతులకు చెందిన విత్తనాలతో కూడిన కిట్లను తయారు చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి గోవింద్, ప్రకృతి విభాగం ఉద్యోగులు నాగమణి, నాయుడుబాబు, కాండ్రేగుల శ్రీనివాసరావు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర పండుగగా సత్యసాయిబాబా శత జయంతి



కె.కోటపాడు, మే 7 (ఆంధ్రజ్యోతి): నవంబర్ 23న జరిగే భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేశ్ కుమార్ మీనా ప్రకటించారు. ఈ విషయం హర్షణీయమని శ్రీ సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారని చెప్పారు. శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఈ జయంతి ఉత్సవాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేయాలని ఇప్పటి నుంచే సన్నాహాలు చేస్తోందన్నారు. ఈ ఉత్సవాలకు దాదాపు 11 లక్షల మంది భక్తులు, పర్యాటకులు హాజరవుతారని ఆయన అంచనా వేశారు. ఈ శతజయంతి వేడుకల గురించి పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి శాసనసభలో అనేక సార్లు ప్రస్తావించారని ఆయన చెప్పారు. వ్యక్తిగతంగా ముఖ్యమంత్రి చంద్రబాబును, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను కలిసి ఆమె వినతిపత్రం అందించారని చెప్పారు. ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం పట్ల అప్పలనాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

బుచ్చెంపేటలో అల్లూరి వర్ధంతి

రోలుగుంట, మే 7 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని బుచ్చెంపేట నవతరం యూత్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామ కూడలిలో ఉన్న అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అల్లూరి శౌర్య పరాక్రమాలను నవతరం యూత్ కొనియాడింది. ఈ కార్యక్రమం నతవరం యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను పరిశీలించిన ఎంపీడీవో

బుచ్చెయ్యపేట మే7(ఆంధ్ర జ్యోతి): మండలంలో బుధవారం ఎంపీడీవో విజయలక్ష్మి నీలకంఠపురం నరసయ్య చెరువులో ఉపాధి హమి పనులను పరిశీలించి మస్టర్లు తనీఖీ చేశారు. శ్రామికులతో మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ధేశించిన రోజుకు కనీస వేతనం 307 వచ్చేలా పనులు చేయాలని సూచించారు. వేసవి కారణంగా ఎండలు ముదరక ముందే పనులు ముగించాలని, ఎమ్‌జీఎన్‌ఆర్‌ఈజీయస్ సిబ్బందిని ఆదేశించారు. వేతనాలు బకాయిలు లేకుండ చూడాలని అన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

చీడికాడ, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలో మంచాల గ్రామ శివారులో అక్రమంగా మద్యం అమ్ముతున్న బొంతు ప్రసాద్ అనే వ్యక్తి దగ్గర 11 మద్యం బాటిళ్లు దొరికాయని, అతడిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సతీశ్ బుధవారం విలేకరులకు తెలిపారు.

అలమండ రోడ్లకు మోక్షం

▸▸ రూ. 3 కోట్లతో మరమ్మతులు

▸▸ సీసీ రోడ్లకు శంకుస్థాపన


రోడ్డు నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యన్నారాయణమూర్తి

దేవరాపల్లి, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.అలమండ గ్రామంలో రోడ్డు సమస్య పరిష్కారం అవుతున్నాయని, ప్రజల చిరకాల వాంఛ తీరుతోందని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. బుధవారం అలమండ గ్రామం మీదగా వేచలం నుంచి వారాడ కూడలి వరకు 13కిలోమీటర్ల రోడ్డు మరమ్మతులకు రూ.మూడు కోట్లు నిధులు నాబార్డు ద్వారా మంజూరు చేశారని చెప్పారు. ఇందులో భాగంగా సినిమా హాలు సెంటర్ నుంచి హనుమాన్ సెంటర్ మధ్యలో రోడ్డును ఆర్‌అండ్‌బీ ఈఈ ఆర్. విద్యాసాగర్‌తో కలసి ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామస్థులతో సమావేశమయ్యారు. పంచాయతీ సహకారం, ప్రజల అంగీకారంతో సుమారు 600 మీటర్ల సీసీ రోడ్డుతో పాటు రోడ్డుకు ఇరు పక్కల డ్రైనేజీలు నిర్మించడానికి సుమారుగా కోటీ యాబై లక్షలు ఖర్చు అవుతుందని చెప్పారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

మండలంలోని ఎం.అలమండలో సిమ్మెంటు రోడ్డుకు జెడ్పీటీసీ కర్రిసత్యం, సర్పంచ్ దాడి.జగన్, అర కిలోమీటర్ మేర సీసీ రోడ్డు నిర్మాణ పనులుకు బుధవారం భూమి పూజ చేశారు. జిల్లా పరిషత్ నిధులు ఐదు లక్షలు, పంచాయతీ నుంచి రెండు లక్షలు రూపాయిల నిధులు మంజూరు అవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

నేడు మరిడిమాంబ జాతర


మరిడిమాంబ

చోడవరం, మే7(ఆంధ్రజ్యోతి): నాలుగేళ్లకోసారి జరిగే స్థానిక గ్రామదేవత మరిడిమాంబ జాతర ఈరోజు జరబోతుంది. ఈ ఏడాది జరిగే పండగను స్థానిక ఎమ్మెల్యే రాజు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు గూనూరు మల్లునాయుడు సోదరులు, పట్టణ నాయకులు ఘనంగా నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేశారు. జాతర సందర్భంగా ఆలయం దగ్గర వార్డులలో విద్యుత్ అలంకరణ చేశారు. ఈ ఉత్సవంలో జబర్దస్త్ కళాకారులు సందడి చేయబోతున్నారు.

కె.కోటపాడు

మండలంలోని కింతాడ శివారు ఏడు గ్రామాల గ్రామదేవత మరిడిమాంబ అమ్మవారి పండగ ఈరోజు ఘనంగా నిర్వహిస్తారు. ఐదేళ్లకోసారి జరిగే ఈ పండగ సందర్భంగా బుధవారం తొలేళ్ళ నిర్వహించారు. రాత్రికి సాంప్రదాయబద్ధమైన కార్యక్రమాలు నిర్వహించారు. జాతరను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది.

ఎక్కువ మంది పనులకు రావాలి

▸▸ ఎంపీడీవో హేమసుందర్రావు

చీడికాడ, మే 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులకు ఎక్కువమంది పనిచేయడానికి వచ్చేలా చూడాలని ఎంపీడీవో హేమసుందర్రావు ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశం బుధవారం మధ్యాహ్నం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు జూన్ 30లోగా 300 నీటికుంటలు నిర్మాణం పూర్తి చేయాల్సి ఉందని, ఈ నెలలో 62 నీటికుంటలు పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏపీవో అల్లు గంగునాయుడు, ఈసీ వి.సతీష్, టెక్నికల్ అసిస్టెంట్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజాదర్బార్

నేడు చీడికాడ ఎంపీడీవో కార్యాలయం దగ్గర ప్రజాదర్బార్ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో హేమసుందర్రావు తెలిపారు. గురువారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంటవరకూ జరిగే ఈ కార్యక్రమానికి మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి హాజరవుతారని చెప్పారు. సమస్యలు ఉన్నవారు ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి దరఖాస్తు ఇవ్వాలని ఆయన సూచించారు.

ఇంట్లో ఒకరికే పదవి

▸▸ టీడీపీ సీనియర్ నాయకులు


సమావేశంలో టీడీపీ నాయకులు

చీడికాడ, మే 7(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల కమిటీలో కొత్తవారికి అవకాశం కల్పించాలని పార్టీలో పలువురు సీనియర్ నాయకులు కోరారు. బుధవారం చీడికాడలో విలేకరులతో మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీలో ఒక ఇంటిలో ఒకరికే పదవి ఇవ్వాలని కోరామని చెప్పారు. ఒక ఇంటిలో ఒకరికే పదవి ఇవ్వాలని తీర్మానించుకున్నామని తెలిపారు. పార్టీలో ఉంటూ వెన్నుపోటుపొడిచేవారికి అవకాశం ఇవ్వకూడదని, మంచి వ్యక్తులను ఎన్నుకునేందుకు సహకరించాలని కోరారు. గతంలో కోనాం జలాశయం చైర్మన్ అభయర్థిగా ఎంపిక సమయంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి 'ఒక్కరికి ఒక పదవి తప్ప రెండవ పదవికి అర్హుడు కాద'ని చెప్పిన విషయాన్ని వారు గుర్తుచేశారు. ఈ సమావేశంలో పలు గ్రామాల ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి వార్షికోత్సవం

కె.కోటపాడు, మే 7 (ఆంధ్రజ్యోతి): శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం మండల కేంద్రం కె.కోటపాడులో బుధవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఉదయం నుంచి స్వామివారికి అభిషేకాలు, తమలపాకుల పూజలు అర్చకుడు శ్రీనివాసరావు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. కె. కోటపాడు మెరక రామచంద్రపురం గ్రామాలకు చెందిన మహిళల కోలాటం అందరినీ అలరించింది. రాత్రికి దేవాలయం దగ్గర భజన కార్యక్రమం జరిగింది. శ్రీ అభయాంజనేయ భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు బత్తి లక్ష్మణ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఈ వార్షికోత్సవం ఘనంగా జరిగింది.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

రావికమతం, మే7 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఈ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి వచ్చిన రోగులకు విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి నేత్ర వైద్యులు పరీక్షలు చేశారు. 60 మంది వైద్య పరీక్షలు చేయించుకోగా, అందలో 21 మందికి కంటి ఆపరేషన్లు చేయించాలని గుర్తించారు. వీరిని శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తీసుకెళ్లి ఉచితంగా కంటి ఆపరేషన్ చేయిస్తామని కో-ఆర్డినేటర్ ఎం.అరుణ్ కుమార్ తెలిపారు.

కేశవ స్వామి వార్షిక కల్యాణ మహోత్సవం

రావికమతం, మే7 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్తకోట గ్రామంలో కొలువుదీరిన శ్రీభూదేవి, శ్రీదేవి సమేత కేశవస్వామి వార్షిక కల్యాణమహోత్సవం, శ్రీరాజరాజేశ్వరి సమేత రాజలింగేశ్వర స్వామి వార్షిక దివ్య లీలా కల్యాణం ఈనెల 8న గురువారం ఉదయం ఒకే వేదికపై నిర్వహించేందకు అవసరమైన ఏర్పాట్లు చేశామని దేవదాయ, ధర్మదాయ శాఖ కార్యనిర్వాహణ అధికారి (ఈవో) కేబీ ఆశా కిరణ్మయి బుధవారం తెలిపారు. ఈ కల్యాణ మహోత్సవం పూర్తిగా దేవదాయ, ధర్మదాయ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామి వారి కరుణ, కటాక్షములు పొందాలని ఆమె కోరారు.

ఘనంగా వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి

రావికమతం,మే7 (ఆంధ్రజ్యోతి): కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి మండల కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. రావికమతం బ్రాహ్మణ వీధిలో ఉన్న అమ్మవారి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం బుధవారం తెల్లవారు జామున మూల విరాట్‌కు క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను గ్రామ వీధుల్లో అంత్యంత వైభవంగా ఊరేగించారు. అమ్మవారికి ఆలయ పురోహితుడు ఆరవెల్లి సమీర్‌శర్మ సహస్ర కుంకుమార్చన, నక్షత్ర హారతి, చామర సేవలను చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొత్త రకాల విత్తనాల వాడకంపై అవగాహన

బుచ్చెయ్యపేట మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం కృషి విజ్ఞాన కేంద్రం, పీ భీమవరం గ్రామ రైతులతో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అనకాపల్లి ప్రాంతీయ పరిశోధన కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్. ముకుందరావు మాట్లాడుతు రైతులు మేలు రకాల విత్తనాల వినియోగించడం వల్ల ఆధిక దిగుబడులు సాధించవచ్చని అన్నారు. వ్యవసాయ కళాశాల విద్యార్థులు ప్రదర్శంచిన పలు ప్రదర్శనలు పరిశీలించారు. పని అనుభవాన్ని రైతులతో పంచుకోవాలని వ్యవసాయ కళాశాల విద్యార్థుల సూచించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ రాజుకుమార్ స్థానిక సర్పంచ్ పినపోలు రామునాయుడు, రామదాసు, రైతులు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గోన్నారు.

మండలంలో మోస్తరు వర్షం

మాడుగుల రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం పడింది. ఉదయం నుంచి ఎండతీవ్రత ఓ మాదిరిగా ఉన్నప్పటికీ ఉక్కపోత చాలా ఎక్కువగా ఉంది. మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో వాతావరణంలో మార్పు వచ్చింది. ఆకాశమంతా మబ్బులు కమ్ముకుని తేలికపాటి గాలులు వీస్తూ చిరు జల్లులుతో మొదలై క్రమేపి జోరందుకుని మోస్తరు వర్షం పడింది.

రాయితీపై వ్యవసాయ పరికరాల పంపిణీ

రోలుగుంట, మే 7(ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్‌ల ద్వారా రాయితీపై అందించే వ్యవసాయ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సుర్ల రామకృష్ణ సూచించారు. బుధవారం రోలుగుంట పీఏసీఎస్ దగ్గర రైతులకు రాయితీపై మంజూరైన వ్యవసాయ పరికరాలను పంపిణీ చేశారు. కో-ఆపరేటివ్ సొసైటీల ద్వారా రైతులకు అనేక పథకాలు అమలు చేస్తున్నారని వాటిన సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల సంఘం అధ్యక్షుడు రుత్తల శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ సుర్ల నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.


అరకులో అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ తనూజారాణి, ఎమ్మెల్యే మత్స్యలింగం


పాడేరు ఐటీడీఏలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి పీవో అభిషేక్‌గౌడ


అల్లూరి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎస్పీ అమిత్‌బర్దార్

అల్లూరి త్యాగం చిరస్మరణీయం

» కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్

» ఘనంగా మన్యం వీరుడి వర్ధంతి

పాడేరు, మే 7 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల కోసం పోరాటం సాగించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగం చిరస్మరణీయమని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ అన్నారు. సీతారామరాజు వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలోని ఆయన విగ్రహానికి ఆయన పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అల్లూరి వంటి మహానుభావులను స్ఫూర్తిగా తీసుకుని గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి పునరంకితమవుదామన్నారు. గిరిజన ప్రాంతంలో ఆంగ్లేయుల అరాచకాలపై అల్లూరి చేసిన పోరాటాలు, తిరుగుబాట్లను ఈసందర్భంగా కలెక్టర్ గుర్తు చేశారు. అలాగే అల్లూరి సీతారామరాజు పేరిట గిరిజనుల కోసం ప్రత్యేకంగా జిల్లా ఏర్పాటు చేయడం ఎంతో ఆనందమన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ, సబ్‌కలెక్టర్ సౌర్యమన్‌పటేల్, అసిస్టెంట్ కలెక్టర్ నాగ వెంకటసాహిత్, జిల్లా రెవెన్యూ అధికారి కె.పద్మావతి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీ, ఐటీడీఏ కార్యాలయాల్లో...

ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ అమిత్‌బర్ధార్ అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే ఐటీడీఏ కార్యాలయంలో ఇన్‌చార్జి పీవో, జేసీ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ, ఐటీడీఏ ఏపీవో ఎం.వెంకటేశ్వరావు ఏవో హేమలత, టీడబ్ల్యూ ఎస్‌డీసీ లోకేశ్, వివిధ విభాగాలకు చెందిన అధికారులు, ఉద్యోగులు సీతారామరాజు చిత్రపటానికి అర్పించారు.

అల్లూరి స్మారక ప్రాంతాల అభివృద్ధికి కృషి: మాజీ ఎమ్మెల్సీ మాధవ్

కొయ్యూరు: అల్లూరి స్మారక ప్రాంతాల అభివృద్ధికి స్థానికుల సహకారంతో కృషి చేయనున్నట్టు మాజీ ఎమ్మెల్సీ మాధవ్ అన్నారు. సీతారామరావు వర్ధంతి ముగింపు ఉత్సవాన్ని పురస్కరించి మాధవ్ అధ్వర్యంలో బుధవారం మండలంలో మంప, రాజేంద్రపాలెం స్మారక ప్రాంతాల్లో అల్లూరి విగ్రహాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాధవ్ మాట్లాడారు. 2012లో ఓ పత్రికలో వచ్చిన కథనానికి స్పందించి అధ్వానంగా ఉన్న అల్లూరి స్మారక ప్రదేశాలను సందర్శించినట్టు చెప్పారు. అప్పటినుంచి వీటిని అభివృద్ధికి తన వంతు కృషి చేశానన్నారు. రాజ్యసభ సభ్యుడు సుబ్బిరామిరెడ్డి, అరకు మాజీ ఎంపీ కొత్తపల్లి గీత నిధుల నుంచి రూ . 20 లక్షలతో మంప రాజేంద్రపాలెం స్మారక ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకున్నానన్నారు. అనంతరం కేంద్ర మంత్రి సురేశ్ ప్రభును కలసి రూ. కోటి మేర నిధులు కేటాయింపునకు కృషి చేసినట్టు చెప్పారు. రూ.50 లక్షలతో మంప పార్కు, కొలను, మిగిలిన రూ.50 లక్షలు రాజేంద్రపాలెం స్మారక ప్రదే శం అభివృద్ధికి వెచ్చించామన్నారు. ఈ ప్రాంతాలు పర్యాటక ప్రాంతాలుగా మార్చాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం చొరవతోఅల్లూరి స్వ గ్రామమైన మోగల్లులో ప్రధాని చేతుల మీదుగా సీతారామరావు విగ్రహావిష్కరణ చేశారన్నారు. పాండ్రంగి, మంప, రాజేంద్రపాలెం, కృష్ణదేవిపేట అల్లూరి స్మారక ఉ ద్యాన వనాలను మరింత అభివృద్ధి కోసం కేంద్రం వద్ద ప్రతిపాదనలు ఉంచినట్టు చెప్పారు. అల్లూరిని కాల్చి చంపిన ప్రదేశంతో పాటు స్మారక ప్రాంతాల్లోని విగ్రహాలకు ఆయన నివాళులర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు మఠం శాంత కుమారి, పార్టీ మం డల అధ్యక్షుడు శివకుమార్, గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు ఉమామహేశ్వరావు,అనకాపల్లి విశాఖపట్నం జిల్లాల అధ్యక్షుడు పరమేశ్వరావు, పరశురామరాజు, నాయకులు సు రేంద్రమోహన్, స్థానిక సర్పంచ్ పీటా సింహాచలం, పాడేరు ఏఎంసీ చైర్‌పర్సన్ మంగతల్లి, నేతలు గాదె శ్రీనివాసరావు, అరిమెల రాజు, సుబ్రహ్మణ్యం, నాయకులు పద్మ రాజు, తదితరులు పాల్గొన్నారు. స్థానిక తహసీల్దారు, ఎంపీడీవో ఎఎల్‌వీ ప్రసాద్, ఎస్‌కేవీ ప్రసాద్‌లు రాజేంద్రపాలెం, మంపలోని అల్లూరి స్మారక ప్రదేశాల్లోని విగ్రహాలకునివాళి అర్పించారు.


పాడేరు రూరల్: అల్లూరి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు తదితరులు


అల్లూరి విగ్రహానికి పూలమాల వేస్తున్న కొయ్యూరు తహసీల్దారు, ఎంపీడీవో తదితరులు

ఘనంగా వాడవాడలా అల్లూరి వర్ధంతి

పాడేరురూరల్: మండలంలోని కిండంగి పంచాయతీ నక్కలపుట్టులోని అల్లూరి విగ్రహం వద్ద టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. టీడీపీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు బొర్రా విజయరాణి, కిండంగి పంచాయతీ సర్పంచ్ కూడా శ్రీలక్ష్మి, నాయకులు డుంబేరు విద్వనాథం, గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రాంగణంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వనుము చిట్టబ్బాయి అల్లూరి చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు రమేశ్‌బాబు, జి.గౌరీశంకరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు. పాడేరు పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుళ్లి సుబ్బారావు, ఉపసర్పంచ్ బూరెడ్డి రామునాయుడు, పాలక వర్గ సభ్యులు పాల్గొని అల్లూరి చిత్రపటానికి నివాళులు అర్పించారు.

చింతపల్లి: స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి సీతారామరాజు పోరాట పటిమ చిరస్మరణీయమని స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి అన్నారు. బుధవారం సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు, ఎంపీపీ, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ టి. రామకృష్ణ ఆయన చిత్రపటాలకు నివాళి అర్పించారు. అలాగే పాతబస్ స్టాండ్‌లో సీతారామరాజు విగ్రహానికి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బోనంగి చిన్నయ్యపడాల్, గిరిజన సంఘం నాయకులు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ చంద్రశేఖరరావు, ఆర్ఐ కృష్ణమూర్తి, సీనియర్ అసిస్టెంట్ రామారావు, కోఆప్షన్ సభ్యుడు నాజర్‌వల్లి, గిరిజన సంఘం నాయకులు పాంగి ధనుంజయ్, సాగిన చిరంజీవి పాల్గొన్నారు.


చింతపల్లిలో నివాళులర్పిస్తున్న ఎంపీపీ, నాయకులు

అల్లూరి ఆదర్శనీయులు: ఎంపీ తనూజారాణి

అరకులోయ: అల్లూరి వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో పార్టీ నాయకులు, అరకు ఎంపీ డా.గుమ్మ తనుజారాణి, ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆయన చి త్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తిని కొనియాడారు.

డుంబ్రిగుడలో..

డుంబ్రిగుడ: అల్లూరి సీతారామరాజు వర్ధంతిని స్థానిక అల్లూరి సీతా రామరాజు యువజన సేవ సంఘం సభ్యులు నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘ నాయకులు అల్లూరి కాంస్య విగ్రహనికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అల్లూరి పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు.



డుంబ్రిగుడ: అల్లూరికి నివాళులర్పిస్తున్న యువజన సంఘం సభ్యులు

వెంకటేశ్వరస్వామి కల్యాణ ఉత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, ఆర్టీసీ జోన్ చైర్మన్ దొన్నుదొర తదితరులు

అరకులోయ, మే 7 (ఆంధ్రజ్యోతి): అరకులోయలో ఈ నెల 8 నుంచి 10 వ తేదీ వరకు నిర్వహించనున్న వెంకటేశ్వర కల్యాణ మహోత్సవాల పోస్టర్లను ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ దినేశుకుమార్ ఆవిష్కరించారు. తొలుత ఆలయాన్ని సందర్శించిన కలెక్టర్‌కు ఆలయ, ఉత్సవ కమిటీ చైర్మన్లు, సభ్యులు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ, ఉత్సవ కమిటీ చైర్మన్లు దాసుబాబు, సీవేరి బాలకృష్ణ , విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్ దొన్నుదొరలతో కలిసి కలెక్టర్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కల్యాణ మహోత్సవాల్లో భక్తులకు ఎటు వంటి ఇబ్బందులు లేకుండా తగిన విదంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ ఉత్సవాలు మూడురోజుల పాటు చేపట్టే కార్యక్రమాల వివరాలను కమిటీ ప్రతినిధులు కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎంవీఎస్.ప్రసాద్, ఆర్ఐ బలరాం, వీఆర్‌వో పవన్‌కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్వీనగర్- పాలగెడ్డ రహదారి కోసం పోరాటం

» అఖిల పక్ష సమావేశంలో నిర్ణయం


సమావేశంలో చర్చిస్తున్న పలు పార్టీల నాయకులు

సీలేరు, మే 7, (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలంలోని ఆర్వీనగర్ పాలగెడ్డ రహదారి నిర్మాణం పనుల కోసం పోరాడాలని అఖిల పక్షాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం సీలేరు రైతు భరోసా కేంద్రంలో పార్టీలకతీతంగా నాయకులు, కార్యకర్తలు సమావేశమై చర్చించారు. సీలేరు, దుప్పులవాడ, ధారకొండ, గుమ్మిరేవులు, గాలికొండ, జీకేవీధి, పాలగెడ్డ తదితర గ్రామాల ప్రజా ప్రతినిధులు, అన్ని పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ మేరకు కార్యాచరణపై తీర్మానించారు. రహదారి నిర్మాణంపై ప్రభుత్వం, అధికారులపై ఎలా ఒత్తిడి తేవాలో ఈ సందర్భంగా చర్చించారు. గత ఏడాది నవంబరులో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసినా, రహదారి నిర్మాణం పనులు పూర్తి చేయకపోవడం దారుణమని అన్నారు. అప్పట్లో కురిసిన భారీ వర్షాలకు లంక పాకల నుంచి సీలేరు వరకు రహదారి పూర్తి స్థాయిలో కొట్టుకుపోయి రవాణా సౌకర్యాలు నెలరోజులకు పైగా నిలిచిపోయినట్టు పేర్కొన్నారు. అనంతరం తాత్కాలిక చర్యలు చేపట్టి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. రానున్న వర్షాకాలంలోగా రోడ్డు పనులు పూర్తి చేయకుంటే గిరిజనులు తీ వ్ర ఇబ్బంది ఎదుర్కొంటారన్నారు. ఈ స్థితిలో రహదారి పనుల కోసం పరిసర గ్రామాల ప్రజలు కలసి రావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి దుర్గో, ఎంపీటీసీ పిల్లా సాంబమూర్తి, డీసీసీ కార్యదర్శి కారే శ్రీనివాస్ కాంగ్రెస్ నాయకులు సత్తిబాబు, కూటమి నాయకులు కారే అప్పలరాజు, వి. గోవింద్, మనోజ్, బలరామ్ మారిబాబు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీ మాత జయంతి వేడుకలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

పాడేరురూరల్, మే 7(ఆంధ్రజ్యోతి): పాడేరు పూర్ణపుష్కల అయ్యప్ప స్వామి ఆలయంలో కొలువై ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలను వనిత మోదమాంబ, పాడేరు హిల్ క్లబ్ ప్రతినిధులు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పాలాభిషేకం, కుంకుమ అభిషేకం, ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సుబ్బారావు, సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, ఉపసర్పంచ్ బూరెడ్డి రామునాయుడు దంపతులు, ఆదిత్య దంపతులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలను చేపట్టారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ ప్రతినిధులు ఐఈసీ ఆఫీసర్ శ్రీనాధు శ్రీ ను, జిల్లా ఇన్‌చార్జి ఎస్.శిరీష, రీజనల్ సెక్రటరీ ఎస్.మణి, క్లబ్ ప్రెసిడెంట్, సెక్రటరీ, కోశాధికారి, సభ్యులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలతో భూసారం


పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏవో

కొయ్యూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): భూసారాన్ని పెంపొందించడానికి పచ్చిరొట్ట ఉపకరిస్తుందని మండల వ్యవసాయ శాఖాధికారిణి ఉమాదేవి సూచించారు. ఖరీఫ్ సీజన్‌కు గానూ ప్రభుత్వం 90 శాతం రాయితీపై సరఫరా చేసిన పచ్చిరొట్ట విత్తనాలు జీలుగు, జనుము విత్తనాలను బుధవారం ఏవో కొండగోకిరి సచివాలయంలో రైతులకు పంపిణీ చేశారు. వీటిని ఎకరాకు 10 కేజీలచొప్పున వేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో సత్యనారాయణ, రైతు సేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవలో వివరాలు నమోదు చేసుకోవాలి

డుంబ్రిగుడ: అన్నదాత సుఖీభవ పథకంలో మండలంలోని రైతులు పూర్తి వివరాలను నమోదు చేయాలని మండల అధికారిణి నీలవేణి అన్నారు. మండల కేంద్రంలో రైతు కేంద్ర కార్యాలయంలో బుధవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్నదాత సుఖీభవ పథకంలో రైతులు తమ సచివాలయాల్లో రైతు సేవా కేంద్రంలో సంబంధిత ధ్రువపత్రాలు, ఆధార్, 1బీ పట్టా, ఆధార్ లింక్ ఫోన్ నంబరు అకౌంట్ జిరాక్స్‌తో కూడిన పత్రాలను వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు అందజేసి ఈ నెల 19లోగా నమోదు చేయించుకోవాలని ఆమె కోరారు.

ఆదివాసీ నిరుద్యోగులకు న్యాయం చేయాలి


ఎమ్మెల్సీ చిరంజీవిరావుకు వినతిపత్రమిస్తున్న స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ ప్రతినిధులు

పాడేరురూరల్, మే 7(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ నుంచి ఏజెన్సీ ప్రాంత టీచర్ పోస్టులకు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ ప్రతినిధులు బుధవారం ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావును విశాఖలో ఆ యనను కలిసి వినతిపత్రమందించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ మెగా డీఎస్సీలో అల్లూరి జిల్లాకు 400 పోస్టులు కేటాయిస్తే అందులో ఆదివాసీలకు కేవలం 24 పోస్టులు మాత్రమే ఉన్నట్టు ఎమ్మెల్సీకి వివరించామన్నారు. ఆదివాసీలకు 100 శాతం ఉద్యోగ రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరామన్నారు. స్పందించిన ఎమ్మెల్సీ ఈ సమస్యను ముఖ్యమంత్రి, విద్యాశాఖా మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారన్నారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.జగన్మోహన్‌రావు, గిరిజన సంఘం జిల్లా నాయకుడు ఎల్.సుందరరావు, గిరిజన ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు కుడుముల కాంతారావు, గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కెకె.జయప్రసాద్, దండకారణ్య లిబరేషన్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు చెండా కేశవరావు, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పాడేరురూరల్, మే 7(ఆంధ్రజ్యోతి): పాడేరు డివిజన్ పరిధిలోని మూడు మండలాల్లో 9వ తేదీ శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పాడేరు విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎల్‌సీహెచ్. పాత్రుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డుంబ్రిగుడ మండలంలోని సాగర, గసభ, కొల్లాపుట్టు, కురిడి గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. కొయ్యూరు మండలంలో రేవళ్ళ, ఆర్.కంఠారం, నిమ్మలపాలెం, బూరుగుపాలెం గ్రామాలకు, పాడేరు మండలంలోని కిండంగి, నక్కలపుట్టు, వర్తనాపల్లి, కాడెలి, లగిశపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

చింతపల్లి ఇన్‌చార్జి కార్యదర్శిగా లక్ష్మీకుమార్

చింతపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేజర్ పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా లక్ష్మీకుమార్‌ని నియమించినట్టు ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. మేజర్ పంచాయతీలో గ్రేడ్-1 కార్యదర్శి పోస్టు ఖాళీగావున్నది. దీంతో ఆరు నెలలుగా తాజంగి కార్యదర్శి శ్రీధర్‌కి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. వ్యక్తిగత కారణాలతో ఆయన తనను ఇన్‌చార్జి బాధ్యతలను తొలగించాలని ఎంపీడీవోకి లేఖ రాశారు. దీంతో పెదబరడ కార్యదర్శి లక్ష్మీకుమార్‌కి చింతపల్లి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినట్టు ఎంపీడీవో తెలిపారు.

జీవో-3పై గత నాలుగేళ్లు ఏం చేశారు?

» వైసీపీ నేతలకు జనసేన నేత గంగులయ్య నిలదీత



పాడేరు, మే 7(ఆంధ్రజ్యోతి): జీవో 3పై ప్రస్తుతం అనవసర రద్ధాంతం చేస్తున్న వైసీపీ నేతలు, గత నాలుగేళ్లు ఏం చేశారని జనసేన అరకులోయ పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ వంపూరు గంగులయ్య ప్రశ్నించారు. జీవో3పై వైసీపీ ద్వంద్వ వైఖరిపై బుధవారం ఆయన ఘాటుగా స్పందించారు. జీవో 3రద్దయిన సమయంలో వైసీపీకి చెందిన నేతలు చట్టాలు చేసే స్థాయిలో ఉన్నప్పటికీ, దానిపై కనీసం స్పందించలేదన్నారు. ఈ జీవో సమస్యపై ముందుకు వచ్చే సంఘాలు, విపక్షాలపై పోలీసులను ప్రయోగించి అణచివేశారన్నారు. ఇప్పుడు ఈ సమస్యపై వివిధ సంఘాలు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం దిశగా చర్యలు చేపడుతుంటే, ఈ ప్రయత్నాలకు వైసీపీ నేతలు అడ్డంకులు సృష్టిస్తున్నారని గంగులయ్య ఆరోపించారు.వాస్తవానికి గిరిజనులకు న్యాయం చేయాలనే ఆలోచన వైసీపీకి లేదన్నారు. గిరిజనులనుమభ్యపెట్టేందుకు డ్రామాలాడుతున్నారన్నారు. ప్రజలు అన్నింటిని గమనిస్తున్నారని గంగులయ్య పేర్కొన్నారు. తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

గడువులోగా సెల్ టవర్ల నిర్మాణాలు పూర్తి

» కలెక్టర్ దినేశ్‌కుమార్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరురూరల్, మే 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సెల్ టవర్ నిర్మాణాలను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్ నుంచి ఐటీడీఏ పీవోలో, బీఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్టెల్ ఇంజనీరింగ్ అధికారులు, అటవీశాఖాధికారులతో సెల్ టవర్లు, రహదారుల నిర్మాణంలో అటవీ అనుమతులపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నార్మల్ గ్రామాల్లో సెల్‌టవర్ల నిర్మాణ సామగ్రి తరలించడానికి అనువుగా ఉండేలా అవసరమైన రహదారులు నిర్మిస్తామని చెప్పారు. జియో సంస్థకు 512 టవర్ల పనులు అప్పగించగా 442 పనులను పూర్తి చేశారని, 70 పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 28 జియో టవర్ల నిర్మాణాలకు అనుమతులు మం జూరు చేస్తామన్నారు. బీఎస్ఎన్ఎల్ సంస్థ పాడేరు-వడ్డాది రహదారిలో ఇష్టారీతిగా తవ్వకాలు చేపట్టడం వల్ల వాహన ప్రమాదాలు జరుగుతున్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. ముంచంగిపుట్టు, అనంతగిరి మండలాల్లో సెల్‌టవర్ల నిర్మాణానికి, రహదారులు నిర్మా ణానికి ప్రతిపాదనలు పంపించాలని ఇంజనీర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ డాక్టర్.ఎంజే.అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, అసిస్టెంట్ కలెక్టర్ కె.చిరంజీవి నాగ వెంకట సాహిత్, రంపచోడవరం ఐటీడీఏ పీవో కె.సింహాచలం, బీఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్‌టెల్, ఇంజనీరింగ్, అటవీశాఖాధికారులు, తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

సీసీ రహదారికి భూమి పూజ

జి.మాడుగుల, మే 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ఎల్.అప్పలరాజు పేర్కొన్నారు. సింగర్బ పంచాయతీ చేపల్లిలో మంజూరైన సీసీ రహదారి పనులకు ఆయన బుధవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నేత సోమెలి చిట్టిబాబు, స్థానిక సర్పంచ్ ఎం.కొండమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు పి.లక్ష్మి పాల్గొన్నారు.

అరకులోయలో మినీ రైల్వేస్టేషన్ ఏర్పాటు

» ఎంపీ తనూజారాణి

అరకులోయ, మే 7 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక కేంద్రం అరకులోయలో రైల్వే రిక్వస్టు స్టేజీ స్థానంలో మినీ రైల్వేస్టేషన్ ఏర్పాటుకు కేంద్ర రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్ అంగీకరించినట్టు ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజారాణి తెలిపారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అల్లూరి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. గత జనవరి ఒకటో తేదీ నుంచి అరకులోయలో కాకుండా పాసింజరు రైళ్లను యండపల్లివలస రైల్వే స్టేషన్‌కు నిలపడంతో గిరిజనులు, ప్రయాణికులు ,పర్యాటకులు ఇబ్బంది ఎదుర్కొన్నారన్నారు. సమస్యను కేంద్ర రైల్వేమంత్రికి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన సానుకూలంగా వ్యవహరించారన్నారు. అధికారులు సర్వే చేసి పంపించారన్నారు. ఈ స్థితిలో కేంద్ర మంత్రి రెండు రోజుల కిందట అరకులోయలో మినీస్టేషన్‌కు అవసరమైన నిధులు రూ.2.50 కోట్లు మంజూరు చేశారన్నారు. ఆరు నెలల వ్యవధిలో మినీస్టేషన్ నిర్మాణం పూర్తి చేస్తారన్నారు.ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, అరకులోయ, అనంతగిరి మండలాలకు చెందిన వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

భూముల భద్రతకే రీ సర్వే: తహసీల్దార్

చింతపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): భూముల భద్రత కోసం రీ సర్వే చేపడుతున్నట్టు స్థానిక ఇన్‌చార్జి తహసీల్దార్ టి. రామకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని తాజంగి పంచాయతీ రాజుబంద గ్రామంలో రెవెన్యూ అధికారులు గ్రామ సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రాజుబందలో 70 కుటుంబాలకు చెందిన వ్యవసాయ భూములు, ప్రభుత్వ ఆస్తులు పూర్తి స్థాయిలో రీసర్వే పూర్తి చేసినట్టు వివరించారు. ఈ వివరాలను రైతులకు తెలియజేశామన్నారు. ఆదివాసీ రైతులు ఈ రీసర్వేపై అభ్యంతరాలు లేవని తెలిపారన్నారు.. ఇతర గ్రామాల్లోనూ ల్యాండ్ రీ సర్వేకు సహకరించాలని కోరారు. రెవెన్యూ ఉద్యోగులు, గిరిజన రైతులు పాల్గొన్నారు.

గృహాల నుంచి చెత్తను సేకరించాలి

గూడెంకొత్తవీధి, మే 7 (ఆంధ్రజ్యోతి): గృహాల నుంచి చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించాలని స్థానిక ఎంపీడీవో వై. ఉమామహేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయం ఉద్యోగులతో ఎంపీడీవో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ స్వర్ణాం ధ్ర, స్వచ్ఛాం ధ్ర సాధనకు చర్యలు తీసుకోవాలన్నారు.తాగునీటి ట్యాంక్‌లను 15రోజులకోసారి శుభ్రం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఈవోఆర్‌డీ పాపారావు పాల్గొన్నారు.

మండల సమావేశాలకు హాజరుకాకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు

» అధికారులపై జి. మాడుగుల ఎంపీపీ ఆగ్రహం

జి.మాడుగుల, మే 7 (ఆంధ్రజ్యోతి) : మండల సమావేశానికి అధికారులు అధికారులు గైర్హాజరుకావడంపై స్థానిక ఎంపీపీ లొంబోరి అప్పలరాజు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇదే ధోరణి కొనసాగితే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత ఎపిడమిక్ సీజన్ కావడంతో వాటి అంశాలపై చర్చిండానికి వైద్యసిబ్బంది హాజరుకాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. అధికారుల తీరు మారకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నా రు. అలాగే, ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా అధికారులు కృషి చేయాలని ఎంపీపీ సూచించారు. మారుమూల గ్రామాలను డోలీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు, గృహాల జియో ట్యాగింగ్ పనులుచేపట్టాలని సంబంధిత అధికారులను పలువురు సభ్యులు కోరారు. పలు రహదారుల ఇరువైపుల తుప్పలు పెరిగి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, వాటిని తొలగించాలని ఎంపీపీ కోరారు. జి.మాడుగుల సచివాలయం పరిధిలో పింఛన్ దారులకు వేలిముద్రలు వేసి నగదు చెల్లింపులు ఎందుకు చేయడంలేదని సర్పంచ్ రాంబాబు ప్రశ్నించారు. గడుతూరు పంచాయతీ గొంపం నుంచి కేబీ పాలెం వరకు, కె.కోడాపల్లి పంచాయతీ జన్నెరు నుంచి గొందివీధి వరకు రహదారి నిర్మాణాలు చేపట్టాలని సంబంధిత ప్రజా ప్రతినిధులు సమావేశంలో విన్నవించారు. గంజాయి సాగు, రవాణా నియంత్రణకు సహకరించాలని స్థానిక ఎస్ఐ షణ్ముఖరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు ఎం. వెంకటలక్ష్మి, ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజు, తహసీల్దార్ రాజ్‌కుమార్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు మాణిక్యం, విజయ్‌కుమార్, ఏవో పాత్రుడు, ఇతర శాఖల అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ అప్పలరాజు, పక్కన జడ్పీటీసీ వెంకటలక్ష్మి

కొత్తూరు వంతెనపై ప్రయాణం.. ప్రమాదం!

బ్రిడ్జిపై అడుగడుగునా గతుకులు
ప్రమాదాల బారిన వాహన చోదకులు
పట్టించుకోని అధికారులు, పాలకులు
వాహనదారులు, ప్రయాణికుల అసహనం

కొత్తూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు వంతెనపై ప్రయాణం నరక ప్రాయంగా తయారైంది. కళాశాల బ్రిడ్జిపై అడుగడుగునా గతుకులు పడడంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నప్పటికీ అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో వాహన చోదకులు, ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు. వంతెనపై ఉన్న అడుగుకొక గొయ్యిలో వర్షం పడితే నీరు నిండిపోయి ప్రమాదకరంగా మారినా పాలకులకు పట్టదా అని వారు ప్రశ్నిస్తున్నారు.

కశింకోట-బంగారుమెట్టకు వెళ్లే ప్రధాన రోడ్డు మీదుగా చోడవరం, వడ్డాదికి అనకాపల్లికి వివిధ పనుల నిమిత్తం వేలాది మంది ఈ మార్గం లోనే ప్రయాణిస్తుంటారు. కళాశాల బ్రిడ్జి పెద్ద పెద్ద గోతులు పడడంతో చినుకు పడితే వర్షం నీటితో నిండిపోతున్నది. దీంతో ప్రయాణికులు, ద్విచక్ర వాహన చోదకులు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. అయినప్పటికీ అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంపై ప్రయాణికులు, వాహన చోదకులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డు నిర్మాణం చేసి తమ ప్రయాణం సుగు మంగా జరిగేలా చూడాలని వారు వేడుకుంటున్నారు.



భారీ గతుకులతో దర్శనమిస్తున్న కొత్తూరు కళాశాల వంతెనే రోడ్డు

అధ్వానంగా ఎన్టీపీసీ ప్రధాన రహదారి

పరవాడ, మే 7 (ఆంధ్రజ్యోతి): ఊటగెడ్డ కూడలి నుంచి సింహాద్రి ఎన్టీపీసీకు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో పలు చోట్ల పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వీటి కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారికి మరమ్మతులు చేపట్టి ఏడాది కాకముందే గుంతలు ఏర్పడడంతో వాహన చోదకులు మండిపడుతున్నారు. ఇదే రహదారి మీదుగా సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన కార్మికులు, ఉద్యోగులతో పాటు వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం, తిక్కవాని పాలెం, నునపర్తి, తంతడి పంచాయతీలకు చెందిన ప్రజలు రాకపో కలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో రహదారిపై ఏర్పడిన గుంతలతో వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రధానంగా రాత్రుల సమ యంలో ఈ రహదారి మీదుగా ప్రయాణించాలంటేనే హడలిపోతున్నారు. పరిమితికి మించి బొగ్గు లోడుతో ప్రయాణిస్తున్న లారీలు కూడా ఇదే రహదారిపై రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో రహదారిపై గుంతలు మరింత పెద్దవిగా మారి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఆదమరిచి ఈ రహదారి మీదుగా ప్రయాణిస్తే తగిన మూల్యం చెల్లించుకోవా ల్సిందేనని వాహన చోదకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజూ రాకపోకలు సాగించే కార్మికులు, ఉద్యోగులు గుంతలతో భయాందోళన చెందుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు తక్షణమే స్పందించి రోడ్డుపై గుంతలను పూడ్చి వేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ఎన్టీపీసీ రహదారిపై ఏర్పడిన గుంతలు

భక్తిశ్రద్ధలతో వాసవీమాత జన్మదిన వేడుకలు

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు.. భక్తుల అభిషేకాలు

అనకాపల్లి టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలను బుధవారం ఆలయ నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలో అమ్మవారిని స్థాపించి వందేళ్లు పూర్తయిన సంద ర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారి పల్లకీ ఊరేగింపు, అమ్మవారి నామ భజన సంకీర్తనలు, మేళతాళాలతో తిరువీధి మహో త్సవం వైభవంగా జరిగింది. గోపూజ, నగరేశ్వరస్వామి, జనార్ధనస్వామికి అభిషే కాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో అమ్మవారి ఉత్సవ మూర్తికి భక్తులతో అభిషేకాలు నిర్వహించారు. లక్ష మల్లె పూలతో అమ్మవారికి అర్చన చేశారు. సామూహిక లలిత సహస్ర నామ స్తోత్రపారాయణం, మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయం చుట్టూ ఉత్సవ మూర్తిని వెండి రథంపై ఊరేగించారు. 102 రకాల మిఠాయిలతో అమ్మవారికి నైవేద్యం పెట్టారు. రాత్రికి ఊంజల్‌సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగ దీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ వుప్పల శ్రీనివాసరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ఉత్సవమూర్తికి అభిషేకాలు చేస్తున్న భక్తులు

పశు వైద్య సేవలపై అవగాహన కల్పించండి

▸▸ జిల్లా పశు వైద్యాధికారి రామ్మోహనరావు

తుమ్మపాల, మే 7 (ఆంధ్రజ్యోతి): పశు వైద్యశాలల్లో అందిస్తున్న సేవలపై పాడి రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ బి.రామ్మో హనరావు సూచించారు. అనకాపల్లి పట్టణంలోని గాంధీనగరం ఏరియా పశు వైద్యశాలలో అనకాపల్లి, కశింకోట మండలాల పశు వైద్యులు, సిబ్బందితో బుధ వారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచిత కృత్రిమ గర్భధా రణ ఇంజక్షన్ పశు వైద్యశాలలో ఉన్నట్టు చెప్పారు. అలాగే లింగ నిర్ధారణ వీర్యం కూడా అందుబాటులో ఉందని వివరించారు. లింగనిర్ధారణ వీర్యం 60 శాతం రాయితీపై పాడి రైతులకు అందిస్తున్నామన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న మినీ గోకులాలు, పశువుల నీటి తొట్టెల నిర్మాణాలను పాడి రైతులు వినియోగించుకోవాలని కోరారు. గ్రామాల్లో సమస్యలపై పాడి రైతులకు ఎప్పటి కప్పుడు సలహాలు ఇస్తూ వైద్యాధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పశు వైద్యాధికారులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రామ్మోహనరావు

పశు సంవర్ధక శాఖ పథకాలను వినియోగించుకోండి

కశింకోట, మే 7 (ఆంధ్రజ్యోతి): పశు సంవర్ధక శాఖలో ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ బి.రామ్మోహనరావు, విశాఖపట్నం డివిజనల్ ఉప సంచాలకులు డాక్టర్ చంద్ర శేఖర్ పిలుపునిచ్చారు. బుధవారం వారు క్షేత్ర స్థాయిలో కశింకోట పశు వైద్య శాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కశింకోటలోని ఆళ్ల శివకుమార్ డెయిరీ ఫారాన్ని సందర్శించారు. ప్రస్తుతం ఉన్న పశుగ్రాసాల సాగు, సెక్స్ సార్టెడ్ సెమెన్ దూడలను తనిఖీ చేశారు. వారి వెంట మండల పశు సంవర్ధక శాఖాధి కారి డాక్టర్ ఆల్ఫొన్సా జార్జి ఉన్నారు.

విప్లవ వీరుడు అల్లూరికి ఘన నివాళులు

అనకాపల్లి టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): విప్లవ వీరుడు అల్లూరి సీతారామ రాజుకు అధికారులు, నాయకులు బుధవారం ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని గూడ్స్‌షెడ్ వద్ద కూటమి నాయకులు అల్లూరి వర్ధంతి నిర్వహిం చారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చేందుకు అల్లూరి సీతారామరాజు తన ప్రాణాలను సైతం ఫణంగా పెట్టారని పేర్కొన్నారు. అల్లూరి చరిత్ర భావితరాల వారు తెలుసుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సబ్బవరపు గణేశ్, 82వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి పోలారపు త్రినాథ్, నాయకులు పెనుమత్స రాజు, పొలి మేర ఆనంద్, కాయల ప్రసన్న, ఎస్.భానుచందర్ పాల్గొన్నారు. అలాగే బీజేపీ నాయకులు అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు వి.నరసింగయాదవ్, నాయకులు కె.సన్యాసిరావు, వి.రమేశ్, ఓరిగంటి నాగమణి, భక్తసాయిరాం, ఎం.భాస్కరరావు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కోరిబిల్లి పరమేశ్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.



అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

పరవాడలో..

పరవాడ, మే 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముందుగా అల్లూరి చిత్రపటానికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అల్లూరి ఆశయ సాధనకు యువత కృషి చేయాలని ఈ సందర్భంగా గనిశెట్టి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వీర్రాజు, లక్ష్మి, రమణమ్మ, రాజు పాల్గొన్నారు.

తాళ్లపాలెంలో కంటి వైద్య శిబిరం

కశింకోట, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపాలెం గ్రామంలో బుధవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబి రాన్ని బీజేపీ నేత గల్లా రాజు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకుంటే కంటి లోపంతో పాటు వ్యాధులు దూరమవుతాయన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచి కంటి పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో 56 మంది రోగులు పాల్గొని వైద్య పరీక్షలు పొందారు. వీరిలో 31 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో క్యాంపు ఇన్‌చార్జి అశోక్‌కుమార్, శంకర్ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పది మద్యం సీసాలతో ఒకరి అరెస్టు

అనకాపల్లి టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీస్‌స్టేషన్ పరి ధిలోని తుమ్మపాలలో బుధవారం ఒక వ్యక్తి నుంచి పది క్వార్టర్ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ ఎ.వెంకటేశ్వరరావు తెలిపారు. తుమ్మపాల కొత్తపేటవీధికి చెందిన చిన్నాల చిట్టిబాబు మద్యం దుకాణంలో మద్యం కొనుగోలు చేసి ఇంటికి తీసుకెళుతుండగా హెడ్‌కానిస్టేబుల్ శ్రీను తనిఖీ చేశారు. పది మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

మహిళపై చేయి చేసుకున్న ముగ్గురిపై కేసు

అనకాపల్లి టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై ఇసుక పోసి రాక పోకలకు ఇబ్బంది కలిగిస్తున్నారని ప్రశ్నించిన మహిళపై చేయి చేసుకొన్న ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూరు పంచా యతీ పరిధి ముత్రాసుకాలనీకి చెందిన జి.కిశోర్ కాలనీకి వెళ్లే రోడ్డులో ఇసుక వేసి రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తుండడంతో బొర్ర ఈశ్వరమ్మ ప్రశ్నించింది. దీంతో కిశోర్‌తో పాటు మరో ఇద్దరు వ్యక్తులు ఆమెపై దాడి చేసి దూషించారు. ఈశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఈశ్వరరావు తెలిపారు.

రాష్ట్రాన్ని విద్యా ప్రయోగశాలగా మార్చొద్దు

▸▸ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్



సమావేశంలో మాట్లాడుతున్న మురళీమోహన్

అనకాపల్లి టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని విద్యా ప్రయోగశాలగా మార్చొద్దని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్ కోరారు. సీఐటీయూ కార్యాలయంలో బుధ వారం జరిగిన ఆయన మాట్లాడుతూ పాఠశాలల పునర్ వ్యవస్థీకరణలో అసంబద్ధాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 12న జిల్లా స్థాయిలో ధర్నాలు నిర్వహిస్తామన్నారు. గత ప్రభుత్వం ఆరు రకాల పాఠశాలలుగా విభజిస్తే, ప్రస్తుత ప్రభుత్వం వాటిని తొమ్మిది రకాల పాఠశాల లుగా విభజించి ప్రజలను గందరగోళ పరిస్థితుల్లోకి నెట్టివేస్తోందని విమర్శించారు. హైస్కూల్‌లో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 1-40, ప్రాథమిక పాఠశాలల్లో 1.20 గా నిష్పత్తి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి, గౌరవాధ్యక్షుడు పి.వెంకటరావు, సహా అధ్యక్షుడు ఆర్.అక్కునాయుడు, కోశాధికారి జోగా రాజేశ్, రాష్ట్ర కౌన్సిలర్ అప్పారావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

తుమ్మపాల, మే 7 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు వ్యతిరేకంగా పాఠశాలలు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం డీఈవో జి.అప్పా రావునాయుడుకు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.బాబ్జి వినతిపత్రం అందించారు. కార్పొ రేట్, పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు కొనాలని తల్లిదండ్రుల మీద ఒత్తిడి తెస్తూ అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు వియ్యపురాజు, ఫణేంద్రకుమార్, జగదీశ్ పాల్గొన్నారు.



అమ్మవారి జాతర వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

ముత్యాలమ్మ జాతర వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

పరవాడ, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలమ్మపాలెం గ్రామంలో ఈ నెల 20న నిర్వహించనున్న అమ్మవారి జాతరకు సంబంధించి పోస్టర్లను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు బుధవారం ఆవిష్కరించారు. జాత రలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్టు ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. జాతరకు పరిసర గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు, సర్పంచ్ చింతకాయల సుజాత, తదితరులు పాల్గొన్నారు.

అమృతపురం టీడీపీ కమిటీ ఎన్నిక



గండి బాబ్జీని సత్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు

సబ్బవరం, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమృతపురం టీడీపీ కమిటీ ఎన్నికను బుధవారం నిర్వహించారు. పార్టీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి, ఏపీ ఆయిల్ ఫెడ్ చైర్మన్ గండి బాబ్జి ఆధ్వర్యంలో ఈ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా గండి రమణబాబు, ఉపాధ్యక్షుడిగా బోకం రమణ, ప్రధాన కార్యదర్శిగా ఓడబోయిన బంగారయ్య, కార్యనిర్వాహక కార్యదర్శులుగా బండారు సత్యనారాయణ, గండి జగన్నాథం, వడిశల రమణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గండి బాబ్జీ మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలన్నీ ప్రజలకు చేరువయ్యేలా పని చేయాలని చెప్పారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను బాబ్జీ సత్కరిం చారు. అలాగే గండి బాబ్జీని గండి ముత్యాలనాయుడు, రమణబాబు సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు గండి వంశీదీప్, బండ దుర్గారావు, గండి ప్రసాద్, చీపురుపల్లి దొరబాబు పాల్గొన్నారు.

సింహాద్రిలో సివిల్ మాక్ డ్రిల్



ప్రమాదంలో చిక్కుకున్న పౌరుడిని తరలిస్తున్న సీఐఎస్ఎఫ్ జవాన్

పరవాడ, మే 7 (ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయాల్లో కార్మికులు, పౌరులు ఎలా స్పందించాలనే అంశంపై అవగాహన కోసం బుధవారం సింహాద్రి ఎన్టీపీసీ సంకల్ప భవనం వద్ద మాక్‌డ్రిల్ నిర్వహించారు. సింహాద్రి ఎన్టీపీసీ ఓ అండ్ ఎం విభాగం జీఎం ప్రశాంత్‌కుమార్ జనా మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో కార్మికులంతా అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనల మేరకు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అడిషినల్ ఎస్పీ దేవ ప్రసాద్ మాట్లాడుతూ అత్యవసర సమయంలో సమన్వయంతో పనిచేసి ప్రాణ, ఆస్తినష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ సంద ర్భంగా సింహాద్రి ఎన్టీపీసీకు చెందిన సీఐఎస్ఎఫ్ సిబ్బంది మాక్‌డ్రిల్ నిర్వ హించారు. ఇందులో భాగంగా యుద్ధ వాతావరణ పరిస్థితులు ఏర్పడితే ఎలా స్పందించాలనే విషయమై మాక్‌డ్రిల్ ద్వారా తెలియజేశారు. వైమానిక దాడి హెచ్చరిక సైరన్ మోగినప్పుడు ఎలా స్పందించాలి, విద్యుత్ సరఫరా నిలిచి పోయినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రథమ చికిత్స కోసం సిద్ధం చేసు కోవాల్సిన అత్యవసర వస్తువులు, మందుల గురించి వివరించారు. ఈ కార్యక్ర మంలో ఆర్డీవో షేక్ ఆయాషా, సింహాద్రి ఎన్టీపీసీ సేఫ్టీ విభాగం ఏజీఎం తుషార్, సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ రాజ్‌సింగ్, అసిస్టెంట్ కమాం డెంట్ రాజ్‌కుమార్, పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, వైద్య శాఖ అధికారి శాంతిప్రభ, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి వెంకటరమణ పాల్గొన్నారు.

వైభవంగా సత్యనారాయణస్వామి రథోత్సవం



రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న రాంకీ

అనకాపల్లి టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుంకరమెట్ట జంక్షన్‌లో రమా సమేత సత్యనారాయణస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. స్వామివారి కల్యాణ మహోత్సవంలో భాగంగా బుధవారం సాయంత్రం ఉత్సవమూర్తుల ఊరేగింపు కార్యక్రమాన్ని జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) ప్రారంభించారు. ప్రత్యేక రథంపై ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహించిన అనంతరం పురవీధుల మీదుగా ఊరేగించారు. గురువారం జరిగే రమా సమేత సత్యనారాయణస్వామి కల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ చైర్మన్ మురళీ తెలిపారు.

ఆశా కార్మికుల సమ్మె నోటీసు

సబ్బవరం, మే 7 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సబ్బవరం పీహెచ్‌సీ పరిధిలోని ఆశా కార్యకర్తలు వైద్యాధికారి చక్రవర్తికి సమ్మె నోటీసు అందజేశారు. కనీస వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యో భద్రత కల్పించాలని, లేబర్ కోడ్ రద్దు చేయాలని బీమా రూ.10 లక్షలు కేటాయించాలని ఆయన డిమాడ్ చేశారు.

ట్రాఫిక్ సిబ్బందిని నియమించరూ..

కొత్తూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): నిత్యం రద్దీగా ఉన్న కొత్తూరు కళాశాల కూడలిలో ట్రాఫిక్ సిబ్బందిని నియమించాలని బహుజన సమాజ్ పార్టీ అనకాపల్లి ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు కోరారు. ఈ మేరకు బుధవారం అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తూరు కళాశాల బ్రిడ్జి నుంచి మలుపు తిరిగే క్రమంలో వాహనాల రాకపోకల రద్దీ ఎక్కువగా ఉండడం వల్ల ప్రమా దాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై డీఎస్పీ స్పందిస్తూ త్వరలోనే సిబ్బందిని నియమిస్తానని హామీ ఇచ్చినట్టు ఆయన తెలిపారు.

సీపీఐ జిల్లా సమితి సభ్యుడిగా వియ్యపు రాజు



వియ్యపు రాజు

తుమ్మపాల, మే 7 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా సమితి సభ్యుడిగా అనకాపల్లి మండలానికి చెందిన వియ్యపు రాజు ఎన్నికయ్యారు. ఈ నెల 10 నుంచి ఎలమంచిలిలో జరుగుతున్న సీపీఐ జిల్లా మహాసభల్లో సీపీఐ ఉన్నత శ్రేణి నాయకులు హాజరయ్యారు. సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లా డుతూ ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న ప్రభు త్వాలపై పోరాటాలు సాగిస్తానని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు నిరసనగా ప్రజలను చైతన్యపరిచి ఉద్యమిస్తామని వివరించారు. కూటమి ప్రభుత్వం తక్ష ణమే సూపర్‌సిక్స్ హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను చిత్తశుద్ధితో నెరవేరుస్తానని ఆయన స్పష్టం చేశారు.

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలిగా పరమేశ్వరి



పరమేశ్వరి

పరవాడ, మే 7 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురా లిగా దేశపాత్రునిపాలెం గ్రామా నికి చెందిన బూసి పరమేశ్వరిని నియమించారు. ప్రస్తుతం జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శిగా పరమేశ్వరి కొనసాగుతున్నారు. కమ్యూనిస్టు పార్టీకి అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ స్థానం దక్కడం అభినందనీయమని మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల, సీపీఐ నా యకులు ఎల్లేటి శ్రీనివాస్, ఆనంద్, సీపీఐ మండల సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు గ్లోబల్ స్కూల్ విద్యార్థి



ఎస్.ఎం.హరిన్

పరవాడ, మే 7 (ఆంధ్రజ్యోతి): బీహార్ రాష్ట్రం పాట్నాలో ఈ నెల 10 నుంచి 17 వరకు జరిగే ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థి ఎస్ఎం హరిన్ ఎంపికయ్యాడు. ఇటీవల ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి యూత్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరిచి ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు అర్హత సాధించాడని పాఠశాల స్పోర్ట్స్ డైరక్టర్ జి.మధు బాబు, కోచ్ పూజారి అమర్నాథ్ బుధవారం ఒక ప్రకట నలో తెలిపారు. ఈ సందర్భంగా హరిన్‌ను పాఠశాల చైర్మన్ పి. సూర్యనారాయణరెడ్డి, సీఈవో కె. నిశాంత్, ప్రిన్సిపాల్ ఎన్. సీతాలక్ష్మి అభినందించారు.

సాంస్కృతిక పోటీలు రేపు

సబ్బవరం, మే 7 (ఆంధ్రజ్యోతి): శరగడం అప్పయ్యమ్మ, ఆదినారాయణ వర్ధంతి పురస్కరించుకుని ఈ నెల 9న అప్పయ్యమ్మ, ఆదినారాయణ మెమోరియల్ చిరిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆరిపాక శివారు చినయాతపాలెంలో సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్టు ట్రస్టు చైర్మన్ శరగడం సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 9న సాయంత్రం 5 గంటల నుంచి పౌరాణిక పద్యనాటక సన్నివేశాలు, ఏకపాత్రాభినయం పోటీలు జరుగుతాయన్నారు. 10వ తేదీ రాత్రి 7 గంటల నుంచి విశాఖ శ్రీసాయి కళానికేతన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో భక్త ప్రహ్లాద భక్తిరస ప్రధాన నాటక ప్రదర్శన జరుగుతందని ఆయన తెలిపారు.

నేడు దుర్గమాంబ పండుగ



లంకెలపాలెం, మే 7 (ఆంధ్రజ్యోతి): కన్నూరు గ్రామ ప్రజల ఆరాధ్య దేవత దుర్గమాంబ అమ్మవారి పండుగను గురువారం నిర్వ హించనున్నారు. ఇందులో భాగంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామ మంతా విద్యుత్ దీపాలంకరణ చేపట్టారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఉదయం 6 గంటల నుంచి దర్శనాలు ప్రారంభమవుతాయన్నారు. ఉత్సవ కమిటీ భక్తులకు ఉచితంగా ప్రసాదాలు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తోందన్నారు. రాత్రి 7 గంటల నుంచి పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

14 నుంచి మరిడిమాంబ జాతర

లంకెలపాలెం, మే 7 (ఆంధ్రజ్యోతి): లంకెలపాలెం పరిసర ప్రాంత గ్రామాల ప్రజల ఆరాధ్య దైవం మరి డిమాంబ జాతరను ఈ నెల 14వ తేదీ నుంచి నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మొదటి రోజు తొలేళ్ల ఉత్సవం, జోడి ఘటాలు, 15న అనుపు ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎర్రా కోటేశ్వరరావు, కర్రి అప్పారావు, సర్వసిద్ధి సన్యాసిరాజు, దాసరి రామారావు, రౌతు రామ చంద్రరరావు, దాముర్రోతి అర్జున్, గుర్రం నాయుడు, రౌతు మూర్తి, నవీన్‌కుమార్, సంతోశ్, త్రినాథ్, జగన్, తురసాల శ్రీను, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఏసీబీ అధికారి అరెస్టు

» సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదులు ఉన్నాయని డబ్బులు డిమాండ్


బలగా సుధాకర్

విశాఖపట్నం, మే 7 (ఆంధ్రజ్యోతి): ఏసీబీ అధికారినంటూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి డబ్బులు డిమాండ్ చేసిన వ్యక్తిని విశాఖ పీఎం పాలెం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నానికి చెందిన బలగా సుధాకర్ చాలాకాలం కిందట విశాఖ వచ్చి ఆదర్శనగర్ పాత డెయిరీఫారం వద్ద నివాసం ఉంటున్నాడు. మంగళవారం మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి, జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ చక్రపాణిని కలిశాడు. తాను ఏసీబీ ఇన్‌స్పెక్టర్‌నని పరిచయం చేసుకున్నాడు. కార్యాలయంలో అవినీతిపై తమకు చాలా ఫిర్యాదులు అందాయని, వాటిపై కేసు నమోదు చేయాల్సి ఉంటుందని బెదిరించాడు. కేసు నమోదుచేయకుండా విడిచిపెట్టాలంటే తనకు రూ.ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో అనుమానం వచ్చిన చక్రపాణి బుధవారం వస్తే డబ్బులు ఇస్తానని చెప్పి పంపించారు. అనంతరం ఏసీబీ అధికారులకు సమాచారం ఇవ్వగా, బుధవారం మధ్యాహ్నం కార్యాలయం వద్ద మాటువేశారు. సుధాకర్ కారులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రాగా, అప్పటికే అక్కడ మాటువేసి ఉన్న ఏసీబీ, పీఎం పాలెం పోలీసులు సంయుక్తంగా అతడిని అదుపులోకి తీసుకున్నారు. గతంలో దోపిడీ కేసులో అరెస్టయి ప్రస్తుతం వేరొక జిల్లాలో పనిచేస్తున్న ఒక మహిళా పోలీస్ అధికారిని జాయింట్ డైరెక్టర్‌గా పేర్కొంటూ ఫోన్‌లో జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌తో మాట్లాడించినట్టు తేలింది. అనంతరం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

సొసైటీ ఉద్యోగులకు పీఆర్‌సీనా!?

... 5వ పేజీ తరువాయి

ఒకరు కలిసి ఇదంతా ప్లాన్ చేశారని, దీనికి కూటమి నాయకులు సహకరిస్తున్నారని తెలిసింది. విజయవాడ నుంచి మౌఖికంగా చెప్పినందున పీఆర్‌సీ ఇచ్చామని కార్పొరేట్ కార్యాలయం నమ్మబలుకుతోంది. దీనిపై సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి, కలెక్టర్ ఇప్పటివరకు స్పందించకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో దీనిపై ప్రభుత్వానికే లేఖ రాయాలని స్థానిక సంఘాలు సమాయత్తవుతున్నాయి.

అవగాహనతోనే తలసేమియాకు చెక్!

ఎర్ర రక్తకణాల్లో లోపంతో వచ్చే వ్యాధి

» వంశపారంపర్యంగా సంక్రమించే అవకాశాలు ఎక్కువ
» సత్వర గుర్తింపు, చికిత్సతో సాంత్వన
» నేడు ప్రపంచ తలసేమియా నివారణ దినం

విశాఖపట్నం, మే 7 (ఆంధ్రజ్యోతి): **తలసేమియా... ఎర్ర రక్తకణాల్లో తలెత్తే లోపం కారణంగా వచ్చే వ్యాధి. తగిన సమయంలో లక్షణాలను గుర్తించి, చికిత్స తీసుకోకపోతే ప్రాణాలను హరించే భయంకరమైన వ్యాధి. తల్లిదండ్రులనుంచి పిల్లలకు సంక్రమించే జన్యుపరమైన వ్యాధి తలసేమియా. మన దేశంతో పాటు ఆఫ్రికా, మిడిల్ ఈస్ట్ దేశాలు, దక్షిణ చైనా ప్రాంతాల్లో ఎక్కువ. తల్లిదండ్రుల్లో జన్యుపరమైన లోపాలు, వ్యత్యాసాల వల్ల పిల్లలకు వ్యాధి సంక్రమిస్తుంది. వారసత్వంగా కూడా సంక్రమించే అవకాశాలెక్కువ. వ్యాధి బారిన పడినవారు అనేక అనారోగ్య సమస్యలకు గురవుతారు. నేడు ప్రపంచ తలసేమియా నివారణ దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' కథనం.**



మానవ మనుగడకు ఆక్సిజన్ అత్యవసరం. మనం తీసుకునే ఆక్సిజన్‌ను రక్తంలోని ఎర్ర రక్తకణాల్లో ఉండే హిమోగ్లోబిన్ శరీరంలోని ప్రతి భాగానికీ చేరవేస్తుంది. ఎర్ర రక్తకణాలు ఏర్పడకపోతే త్వరగా చనిపోతాయి. దీనివల్ల శరీరంలో రక్తం శాతం తగ్గి, ఫలితంగా రక్తహీనత ఏర్పడుతుంది. దీనివల్ల ఏర్పడే సమస్యే తలసేమియా. ప్రపంచ వ్యాప్తంగా లక్షల మంది ఈ వ్యాధితో బాధ పడుతున్నారు.

తలసేమియా రకాలు: ఆల్ఫా తలసేమియా, బీటా తలసేమియా తీవ్రత ఆధారంగా వ్యాధిని నాలుగు రకాలుగా వర్గీకరించారు.

తలసేమియా ట్రేడ్: ఈ దశలో ఎర్ర రక్తకణాలు సాధారణం కంటే చిన్నవిగా ఉంటాయి. వ్యాధి లక్షణాలు బయటపడవు.

తలసేమియా మైనర్: ఈ దశలో సాధారణ రక్తహీనత లక్షణాలు కనిపిస్తాయి. పరీక్షలు చేస్తే వ్యాధి నిర్ధారణ జరుగుతుంది.

తలసేమియా ఇంటర్మీడియా: ఈ దశలో కొందరిలో కాస్త తీవ్రంగా, మరి కొందరిలో తీవ్ర రక్తహీనత లక్షణాలు కనిపిస్తాయి. వీరు రక్తమార్పిడి చేసుకోవాల్సి వస్తుంది.

తలసేమియా మేజర్: ఇది ప్రమాదకరస్థాయి. తీవ్రమైన రక్తహీనత సమస్య ఏర్పడుతుంది. దీనివల్ల తరచూ రక్తం ఎక్కించాల్సి ఉంటుంది. లేదంటే ప్రాణాపాయం సంభవిస్తుంది.

లక్షణాలివీ...

వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే మూడు నెలల నుంచి 18 నెలల మధ్య బయట పడుతుంది. ఎర్ర రక్తకణాలు నాశనమవడంతో శరీర రంగు పాలిపోతుంది. శారీరక ఎదుగుదల ఉండదు, పచ్చకామెర్లు సోకవచ్చు. ఆయాసం, అలసట, నీరసం, శరీరంలో వాతలు వస్తాయి. రోగ నిరోధక శక్తి తగ్గుతుంది. కాలేయం వాపు, కాళ్ల అల్సర్ వంటి లక్షణాలు కనిపిస్తాయి. పిల్లలు తరచూ అనారోగ్యానికి గురవుతారు. వాంతులు, విరేచనాలు శ్వాసకోస సమస్యలు తలెత్తుతాయి. తీవ్రత తక్కువగా ఉన్నవారిలో ఏదైనా ఆపరేషన్ చేసే సమయం, స్త్రీలు గర్భం దాల్చినప్పుడు, కాన్పు తరువాత తలసేమియాను గుర్తించే వీలుంటుంది. కుటుంబంలో ఎవరికైనా తలసేమియా ఉంటే వారికి పుట్టిన పిల్లలకు పరీక్షలు చేయడం ద్వారా ప్రారంభంలోనే వ్యాధిని గుర్తించే వీలుంది.

వ్యాధి నిర్ధారణ...

సీబీసీ (కంప్లైంట్ బ్లడ్ కౌంట్) టెస్ట్, హిమోగ్లోబిన్



ఎలక్ట్రో ఫొరెసిస్, ఎఫ్‌పీ (ప్రీ-ఎరిత్రోసైట్ ప్రోటోపోరో ఫైరిన్), ఫెర్రిటిన్ వంటి పరీక్షలతో వ్యాధిని నిర్ధారించవచ్చు. గర్భిణుల్లో సీవీఎస్ లేదా యామ్ని సెంటెసిస్ పరీక్షతో పుట్టబోయే పిల్లలతో వ్యాధిని నిర్ధారించవచ్చు. ఆల్ఫా తలసేమియాను డీఎన్ఏ పరీక్షతో నిర్ధారిస్తారు.

చికిత్స విధానం

వయసు, ఆరోగ్య పరిస్థితి, వ్యాధి తీవ్రత, లక్షణాలు, మెడికల్ హిస్టరీ మందులకు స్పందించే తీరును బట్టి చికిత్సా విధానం ఉంటుంది. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్నవారికి శరీరంలో ఎర్ర రక్తకణాల సంఖ్యను పెంచడానికి 15 నుంచి 20 రోజులకు ఒకసారి రక్తం ఎక్కిస్తారు.

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

రక్తహీనత ఉంటే కారణాలు తెలుసుకోవాలి. వైద్యుల సూచన మేరకు హిమోగ్లోబిన్ ఎలక్ట్రోఫొరెసిస్ పరీక్ష చేయిస్తే వ్యాధి రకం, తీవ్రత తెలుస్తాయి. ఆ తరువాత జన్యుపరమైన పరీక్షలు చేసి, పిల్లలకు వ్యాధి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దీనివల్ల తర్వాతి తరానికి వ్యాధి సంక్రమించకుండా చేసే వీలుంటుంది.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

... 5వ పేజీ తరువాయి

స్టేషన్ పరిధిలోని ఒక ఇంటిలో ల్యాప్‌టాప్, హోండా సిటీ కారు తాళాలు, పట్టు చీరలతో ఉన్న లగేజీ బ్యాగు అపహరించుకుపోయారు. ఈ చోరీలకు పాల్పడిందిని వీరేనని పోలీసులు నిర్ధారించారు. చోరీ కేసుల్లో పట్టుబడి రిమాండ్‌లో వున్న సమయంలో ఏర్పడిన పరిచయాలతో ఒక ముఠాగా ఏర్పడి రెండు తెలుగు రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడుతున్నట్టు గుర్తించారు. ఈ సందర్భంగా రెండుంపావు తులాల బంగారం, రెండు కిలోల వెండి వస్తువులు, రూ.1.05 లక్షల నగదు, ల్యాప్‌టాప్, ఐఫోన్, తొమ్మిది పట్టు చీరలను పోలీసులు సీజ్ చేశారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకుని చోరీ సొత్తు స్వాధీనం చేసుకోవడంలో ప్రధాన పాత్ర పోషించిన రూరల్ సీఐ జి.అశోక్‌కుమార్, ఎస్ఐ జి.రవికుమార్, అదనపు ఎస్ఐ జె.నాగేశ్వరరావు, ఏఎస్ఐ భాస్కరరావు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

అల్లూరి చిరస్మరణీయుడు

» కలెక్టర్ విజయకృష్ణన్


కలెక్టరేట్‌లో అల్లూరి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అధికారులు

తుమ్మపాల, మే 7 (ఆంధ్రజ్యోతి): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయుడని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. అల్లూరి వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లో బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బ్రిటిష్ పాలకులపై నాడు అల్లూరి చేసిన పోరాటం స్వాతంత్ర్య ఉద్యమంలో ఎంతోమందికి స్ఫూర్తినిచ్చిందన్నారు. బ్రిటిష్ పాలకులను గడగడలాడించి తెలుగువారి పౌరుషాన్ని ప్రదర్శించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జేసీ జాహ్నవి, డీఆర్ఓ వై.సత్యనారాయణరావు, ఎస్‌డీసీ కేఆర్‌ఆర్‌సీ సుబ్బలక్ష్మి, సీపీఓ డి.రామారావు, డీఎల్‌డీఓ మంజులవాణి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి నాగశిరీషా తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

జిల్లా ఎస్పీ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావుల పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. బ్రిటిష్ పాలకుల నుంచి దేశానికి విముక్తి కలిగించడానికి గిరిజనులతో కలిసి సాయుధ పోరాటం చేశారని గుర్తు చేసుకున్నారు. ఆయన ధైర్యం, దేశభక్తి, ప్రాణత్యాగాన్ని ప్రజలు ఎన్నటికీ మరిచిపోరని అన్నారు. డీఎస్పీ మోహనరావు, సీఐలు లక్ష్మణమూర్తి, బాల సూర్యారావు, లక్ష్మి, రమేశ్, గఫూర్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేర విచారణలో శాస్త్రీయ ఆధారాల సేకరణ కీలకం

» పోలీస్ అధికారులకు ఎస్పీ అమిత్‌బర్ధార్ సూచన


పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ అమిత్‌బర్ధార్

పాడేరు, మే 7(ఆంధ్రజ్యోతి): నేర విచారణలో శాస్త్రీయమైన ఆధారాల సేకరణ అత్యంత కీలకమని ఎస్పీ అమిత్‌బర్ధార్ తెలిపారు. ఆధునిక పద్ధతుల్లో సాక్ష్యాలు, ఆధారాల సేకరణపై బుధవారం ఇక్కడ నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. నేరాలకు పాల్పడిన వాళ్లు ఎట్టిపరిస్థితుల్లోనూ తప్పించుకోకుండా అవసరమైన అన్ని సాక్ష్యాలు, ఆధారాలను పక్కాగా సేకరించాలని, ఈక్రమంలో ఆధునిక పద్ధతులు, ఫోరెన్సిక్ ఆధారాల సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఒక నేరానికి సంబంధించి ఆడియో, వీడియో, భౌతిక సాక్ష్యాలు, రక్తనమూనాలు, డీఎన్ఏ, మానవ అవయవాలు, తదితర అన్నింటిని పక్కాగా సేకరించాలన్నారు. దర్యాప్తు లేదా విచారణలో అన్ని జాగ్రత్తలు తీసుకుని ఆయా సాక్ష్యాలు, ఆధారాలను సేకరించడం ద్వారా నేరాన్ని నిరూపిస్తే, చట్టపరంగా శిక్షించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆ దిశగా ప్రతి పోలీస్ అధికారులు ఆలోచన చేయాలని ఆయన సూచించారు.

యథేచ్ఛగా అక్రమ లేఅవుట్‌లు

... 5వ పేజీ తరువాయి

రోడ్డును ఆనుకొని ఏడాది కాలంలోనే 20కిపైగా అనధికార లేఅవుట్‌లు వెలశాయి. వీటిలో సగానికిపైగా లేఅవుట్లకు ఎటువంటి అనుమతులు లేవు. కనీసం ల్యాండ్ కన్వర్షన్ ఫీజు కూడా పంచాయతీకి చెల్లించలేదు. మునగపాక మండలంలో అనధికార లేఅవుట్‌లు వేస్తున్న రియల్టర్లపై చర్యలు చేపట్టాలని ఇటీవల స్థానిక ప్రజాప్రతినిధి ఒకరు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కానీ ఇంతవరకు పట్టించుకోలేదు.

ప్రభుత్వ భూముల్లో పాగా...

కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ భూములు, గెడ్డలు, కొండవాలు ప్రదేశాలు, గోర్జిలను ఎంపిక చేసుకుని వాటి పక్కన వుండే జిరాయితీ భూములను కొనుగోలు చేస్తున్నారు. అనంతరం ఆయా భూములను కబ్జాచేసి, జిరాయితీ భూమితోపాటు లేఅవుట్ వేసి దర్జాగా అమ్ముకుంటున్నారు. కశింకోట మండలం ఉగ్గినపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 222లో ప్రభుత్వ రికార్డుల్లో గయాలుగా నమోదై ఉన్న సుమారు 5.3 ఎకరాల ప్రభుత్వ భూమిని ఒక రియల్టర్ ఆక్రమించారు. స్థానిక నేత ఒకరు తెర వెనుక ఉండడంతో తమవద్ద పట్టాదారు పాస్‌పుస్తకాలు ఉన్నాయని చెబుతూ దర్జాగా లేఅవుట్ వేస్తున్నారు. ఇందులో కొంత రిజర్వు ఫారెస్టు భూమి కూడా ఉన్నట్టు తెలిసింది.

కొరవడిన తనిఖీలు

జిల్లాలో అనుమతులు లేకుండా ఎడాపెడా అక్రమ లేఅవుట్‌లు వేస్తున్నప్పటికీ పంచాయతీ, రెవెన్యూ, వీఎంఆర్‌డీఏ అధికారులు పట్టించుకోవడంలేదు. క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి చాలా కాలమైంది. పత్రికల్లో కథనాలు వస్తే.. రెవెన్యూ సిబ్బంది మొక్కుబడిగా అక్కడకు వెళ్లి పరిశీలించి వచ్చేస్తున్నారు. అంతేతప్ప లేఅవుట్ వేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడంలేదు. కనీసం లేఅవుట్‌లో హెచ్చరిక బోర్డు కూడా పెట్టడంలేదు. వీఎంఆర్‌డీఏకి చెందిన ఒక అధికారికి అనకాపల్లి జిల్లా పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించగా, ఆయన వారంలో ఒకరోజు మాత్రమే కలెక్టరేట్‌లో జరిగే సమావేశానికి హాజరై వెళ్లిపోతున్నారు. వాస్తవానికి గ్రామ పంచాయతీ, రెవెన్యూ, జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ అధికారులు నెలలో ఒకటి, రెండు పర్యాయాలు క్షేత్రస్థాయిలో పర్యటనలు జరిపి లేఅవుట్లను పరిశీలించాలి. అనుమతులు లేకపోతే లేఅవుట్‌లో వేసిన రోడ్లను ఎక్స్‌కవేటర్లతో ధ్వంసం చేసి, 'ఇది అనుమతి లేని లేఅవుట్. ఇక్కడ ఎవరూ ప్లాట్‌లు కొనరాదు' అని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలి. కానీ జిల్లాలో లేఅవుట్లను తనిఖీ చేయడం లేదు. అక్రమ లేఅవుట్‌లపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే స్పందించడంలేదు. దీంతో రియల్టర్లు రైతుల నుంచి భూములు కొనుగోలు చేసి అక్రమంగా లేఅవుట్‌లు వేస్తున్నారు.

వసతుల్లేని కలెక్టరేట్

... 5వ పేజీ తరువాయి

వస్తుంటారు. అనకాపల్లిలో బస్సు దిగి, అధిక చార్జీలు చెల్లించి ఆటోల్లో ఇక్కడకు చేరుకోవాల్సి వస్తున్నది. మరికొంతమంది సొంత వాహనాల్లో వస్తుంటారు. వాహనాల నిలుపుదలకు షెడ్లు లేవు. కనీసం నీడనిచ్చే పెద్ద చెట్టు కూడా లేవు. అధికారులతోపాటు వివిధ పనుల కోసం కలెక్టరేట్‌కు వచ్చే వారు తమ వాహనాలను ఆరుబయట పార్కింగ్ చేసుకోవాల్సిందే. ఎండకు, వానకు పాడైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుండగా కలెక్టరేట్ చుట్టుపక్కల ఎక్కడా ఏటీఎం కేంద్రం లేదు. దీంతో డబ్బులు డ్రా చేయడానికి ఐదు కిలోమీటర్ల దూరంలో అనకాపల్లి పట్టణంలోకి వెళ్లాల్సి వస్తున్నది. కలెక్టరేట్ సిబ్బంది అధికారికంగా కొరియర్ చేయాలంటే అనకాపల్లి వెళ్లాల్సిందే. వెంటనే వెళ్లడానికి ఒక్కోసారి ఆటోలు సైతం అందుబాటులో వుండవు. కలెక్టరేట్ సమీపంలో సరైన హోటళ్లు లేకపోవడంతో వివిధ పనులపై వచ్చే ప్రజలు మధ్యాహ్నం సరైన భోజనం లేక ఇబ్బందులు పడుతున్నారు.

క్రైం... crime news

చికిత్స పొందుతూ క్షతగాత్రుడి మృతి


ధర్మిరెడ్డి శ్రీనివాసరావు (ఫైల్ ఫొటో)

అచ్యుతాపురం, మే 7 (ఆంధ్రజ్యోతి): రామన్నపాలెం వద్ద ఈ నెల ఐదో తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. రామన్నపాలెం గ్రామానికి చెందిన ధర్మిరెడ్డి శ్రీనివాసరావు (46) సోమవారం అచ్యుతాపురం నుంచి బైక్‌పై ఇంటికి వెళుతుండగా రామన్నపాలెం రామాలయం వద్ద వెనుక నుంచి వస్తున్న డంపర్ లారీ ఢీకొన్నది. దీంతో తలకు తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం విశాఖ ఆరిలోవ హెల్త్ సిటీలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్సకు రూ.50 లక్షలు ఖర్చవుతుందని, ముందుగా రూ.25 లక్షలు కట్టాలని, అయినప్పటికీ బతికే అవకాశాలు తక్కువని ఆస్పత్రి నిర్వాహకులు చెప్పారు. శ్రీనివాసరావు కుటుంబానికి అంత ఆర్థిక స్థోమత లేకపోవడంతో కేజీహెచ్‌కి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి దుర్మరణం

అనకాపల్లి టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని పూడిమడక జంక్షన్ సమీపంలో బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతిచెందాడు. ట్రాఫిక్ ఎస్ఐ శేఖరం ఆయన అందించిన వివరాల ప్రకారం.. మాకవరపాలెం మండలం జి.కోడూరుకు చెందిన భీశెట్టి గణేశ్ అప్పారావు(26) అనకాపల్లిలోని ఒక సర్వీసింగ్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. మునగపాక వెళ్లే రోడ్డులో జేఎంజే స్కూల్ సమీపంలో నివాసం వుంటున్నాడు. బుధవారం తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వచ్చి రోడ్డుపక్కన నడుచుకుంటూ వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన గణేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుని తల్లి నూకరత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శేఖరం తెలిపారు.

విద్యుదాఘాతానికి యువకుడి బలి


పల్లా అప్పన్న (ఫైల్ ఫొటో)

బుచ్చెయ్యపేట మే 7 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని బంగారుమెట్టలో వున్న ఆయిల్ పామ్ తోటలో గెలలు కోస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఒక యువకుడు మృతిచెందాడు. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి. మండలంలోని ఎల్‌బీపీ అగ్రహారం గ్రామానికి చెందిన పల్లా అప్పన్న (31) చాలా ఏళ్ల నుంచి బంగారుమెట్టలో వున్న ఒక పామాయిల్ ఫ్యాక్టరీలో ఎక్స్‌కవేటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ ఫ్యాక్టరీ చుట్టూ ఆయిల్‌పామ్ తోటలు వున్నాయి. బుధవారం మధ్యాహ్నం తోటలో ఆయిల్ పామ్ గెలలు తెంపుతుండగా, పైన వున్న విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో అతను షాక్‌కు గురై కిందపడిపోయాడు. వెంటనే చికిత్స నిమిత్తం చోడవరం తరలిస్తుండగా దారిలో మృతిచెందాడు. దీంతో అప్పన్న మృతదేహంతో కుటుంబ సభ్యులు పామాయిల్ ఫ్యాక్టరీ వద్దకు వచ్చి నష్టపరిహారం చెల్లించాలని ఆందోళనకు దిగారు. అప్పన్నకు భార్య రేవతి, రెండేళ్ల కుమారుడు వున్నారు. రేవతి ప్రస్తుతం నిండు గర్భిణి. సమాచారం అందుకున్న పోలీసులు పామాయిల్ ఫ్యాక్టరీ వద్దకు వచ్చి ఆందోళనకారులతో మాట్లాడారు. నష్టపరిహారంపై ఫ్యాక్టరీ యాజమాన్యం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీసులు, గ్రామపెద్దలతో ఫ్యాక్టరీ యాజమాన్య ప్రతినిధులు చర్చలు జరిపారు. నష్టపరిహారం ఇవ్వడానికి అంగీకరించడంతో రాత్రి 9.30 గంటలకు ఆందోళనను విరమించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చోడవరం సీహెచ్‌సీ మార్చురీకి తరలించారు.

డివైడర్‌ను ఢీకొన్న బైక్.. యువకుడి మృతి


వెంకట అనిల్ (ఫైల్ ఫొటో)

నక్కపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు జంక్షన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతిచెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఎస్ఐ సన్నిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ నగరంలోని వలసపాకల ప్రాంతానికి చెందిన అనసూరి వెంకట అనిల్(21), అతని స్నేహితుడు పెంకె తేజతో కలిసి ద్విచక్రవాహనంపై విశాఖపట్నం వెళుతున్నారు. నక్కపల్లి మండలం వేంపాడు జంక్షన్ సమీపంలో వాహనం అదుపు తప్పి డివైడర్‌ని ఢీకొనడంతో ఇద్దరూ రోడ్డుపై పడిపోయి తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వెంకట అనిల్ పరిస్థితి విషమంగా వుండడంతో కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా దారిలో మృతిచెందాడు. ఈ ప్రమాదంపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సన్నిబాబు తెలిపారు.

బైక్ ఢీకొని ఒకరి మృతి


నల్లబారిక శివ (ఫైల్ ఫొటో)

నక్కపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినదొడ్డిగల్లు వద్ద జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్ఐ సన్నిబాబు తెలిపిన సమాచారం మేరకు.. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన నల్లబారిక శివ(37) నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లు పాకల వద్ద పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి రోడ్డు దాటుతుండగా తుని వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న బైక్ ఢీకొనడంతో తీవ్ర గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా వుండడంతో కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా దారిలో మృతిచెందాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఏలేరు కాలువలో జారి పడి ఒకరి మృతి

కశింకోట, మే 7 (ఆంధ్రజ్యోతి): కాలకృత్యాలు తీర్చుకోవడానికి కాలువ గట్టుకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తూ కాలు జారి కాలువలో పడి మృతిచెందాడు. సీఐ అల్లు స్వామినాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. తాళ్లపాలెం పంచాయతీ బంగారయ్యపేట గ్రామానికి చెందిన ఓయిబోయిన లక్ష్మణరావు (40) మంగళవారం ఉదయం ఆరు గంటల సమయంలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఏలేరు కాలువ గట్టుకు వెళ్లాడు. ఎంతసేపైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు కాలువ పరిసరాల్లో వెతికారు. కానీ ఆచూకీ లభించలేదు. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో రామన్నపాలెం వద్ద ఏలేరు కాలువలో శవమై తేలాడు. మృతుడి తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

బుచ్చెయ్యపేటలో చైన్ స్నాచింగ్

బుచ్చెయ్యపేట, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రంలో ఒక మహిళ మెడ నుంచి గుర్తుతెలియని వ్యక్తులు బంగారం గొలుసు తెంచుకుని పరారయ్యారు. పోలీసులు తెలిసిన వివరాల ప్రకారం.. బుచ్చెయ్యపేటకు చెందిన ఆయితిరెడ్డి లక్ష్మి బుధవారం ఉదయం సొంతపనిమీద బయటకు వెళ్లడానికి ఆటో కోసం రోడ్డుపై వేచివున్నది. ఈ సమయంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై ఆమె వద్దకు వచ్చి మెడలో వున్న నాలుగు తులాల బంగారం గొలుసును తెంచుకుని బంగారుమెట్ట జంక్షన్ వైపు పారిపోయారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దుండగుల కోసం సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	130.00
లైవ్ ధర	150.00
విత్ స్కిన్	270.00
స్కిన్ లెస్	280.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509